


www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శనివారం 13-05-2023 సంపుటి : 04 సంచిక : 225 పేజీలు : 4 వెల : రూ 3-00

# రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కోసం శ్రీలక్ష్మీ మహాయజ్ఞం

**సహస్ర కుండాత్మక చండీ,రుద్ర యాగాలు**
**ప్రత్యేక పూజలు చేసిన సిఎం జగన్**



విజయవాడ,మే12 : నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ప్రారంభమైన అష్టోత్తర శతకుండాత్మక (108) చండీ, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత శ్రీ లక్ష్మి మహా యజ్ఞంలో సీఎం జగన్ దంపతులు పాల్గొన్నారు.రాష్ట్ర సర్వతోము ఖాభివృద్ధి కోసం శ్రీలక్ష్మీ మహాయజ్ఞం చేస్తున్నారు. సిఎం జగన్ యజ్ఞ సంకల్పం తీసుకున్నారు. ఈ సందర్భంగా గోశాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కపిల గోవుకు హారతి ఇచ్చి, అఖండ దీపారాధనలో పాల్గొన్నారు. ఈ క్రమంలో వేదపండితులు సీఎం జగన్‌కు ఆశీర్వాదం అందజేశారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో శుక్రవారం నుంచి ఆరో రోజులపాటు జరగనున్న అష్టోత్తర శతకుండాత్మక చండీ, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహాయజ్ఞం ప్రారంభమైంది. తెల్లవారుజామున ఐదు గంటలకు వేదస్వస్తి, గోపూజ, విఘ్నేశ్వర పూజతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. శ్రీలక్ష్మీ మహాయజ్ఞాన్ని సీఎం జగన్ ప్రారంభించారు. ఉదయం 9 గంటలకు 1,008 మందితో విష్ణు సహస్రనామ పారాయణం, 11గంటలకు కుర్తాళం శ్రీసిద్ధేశ్వరీ పీఠాధిపతులు పరమహంస పరివ్రాజకాచార్యులు, సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి, తిరుపతి శ్రీశక్తి పీఠాధీశ్వరులు రమ్యానంద భారతీ మహాస్వామి అనుగ్రహ భాషణం ఇచ్చారు. సాయంత్రం భూమాత స్తోత్ర పారాయణం, మృత్సంగ్రహణం, అంకురారోహణం, అగ్నిప్రతిష్ఠ జరుగుతాయి. సాయంత్రం 5.30 నుంచి 6.30 గంటల వరకు చాగంటి కోటేశ్వరరావు ధార్మిక ప్రవచనాలు ఉంటాయి. సాయంత్రం 6.30 నుంచి 7.30 గంటల వరకు ఆముక్తమాల్యద, శ్రీగోదారంగనాథుల కల్యాణం కూచిపూడి నృత్యరూపకాన్ని ప్రదర్శిస్తారు. రాత్రి 7.30 నుంచి 9 గంటల వరకు శ్రీదుర్గామల్లేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తారు. రాజశ్యామల యాగం కారణంగా స్టేడియంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. రోజుకు 10వేల మంది వరకు ఈ యాగానికి హాజరవుతారని అంచనా వేశారు. కార్యక్రమంలో మంత్రులు, భార్య భారతి, తల్లి విజయమ్మలు కూడా పాల్గొన్నారు. యజ్ఞ కార్యక్రమాలను భక్తులు వీక్షించేలా ఉమ్మడిగా యాగశాలల చుట్టూ 4 క్యూలైన్లను ఏర్పాటు చేశారు. యజ్ఞ కార్యక్రమాలను చూస్తూనే ఆ యాగశాల చుట్టూ ప్రదక్షిణ చేసేలా వీటిని తీర్చిదిద్దారు. వాటిలో ఒకటి వీఐపీల కోసం కేటాయించారు. రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాల ఆధ్వర్యంలో భక్తులకు రోజుకు ఒక ఆలయం చొప్పున ప్రసాదాల పంపిణీ చేపడుతున్నాయి.

# చంద్రబాబుకు ఓటు వేస్తే సంక్షేమ పథకాలు ఆగినట్టే: సీఎం జగన్



నెల్లూరు జిల్లా: రైతన్నలందరికీ చుక్కల భూములపై పూర్తి హక్కు కల్పించామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు.దశాబ్దాలుగా రైతన్నల కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న చుక్కల భూముల సమస్యలకు సీఎం చెక్ పెట్టారు. వాటికి శాశ్వత పరిష్కారం చూపిస్తూ రైతన్నలకు ఆ భూములపై సంపూర్ణ హక్కులు కల్పించారు. శుక్రవారం ఈ కార్యక్రమాన్ని నెల్లూరు జిల్లా కావలిలో సీఎం ప్రారంభించారు.ఈ సందర్భంగా బహిరంగ సభలో సీఎం జగన్ మాట్లాడుతూ, "రైతన్నల కష్టం నేను చూశాను.. మీకు నేను ఉన్నాను. ఇప్పటికే గిరిజనులకు ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలు పంపిణీ చేశాం. గతంలో అవనిగడ్డ నియోజకవర్గంలో రైతుల సమస్యలను పరిష్కరించాం. ప్రతి రెవెన్యూ గ్రామంలో భూసర్వే వేగంగా జరుగుతోంది. ఇప్పటికే 2వేల గ్రామాల్లో భూ సర్వే పూర్తి చేశాం. భూ హక్కు పత్రాలు కూడా వేగంగా ఇస్తున్నాం. దేశంలో ఎక్కడా లేని విధంగా భూసర్వే చేస్తున్నాం. ఈ నెల 20న 2వేల గ్రామాల్లో భూహక్కు పత్రాలు పంపిణీ చేస్తాం. ఆర్బీకేల ద్వారా రైతులకు ఎన్నో సేవలు అందుబాటులోకి తెచ్చాం" అని సీఎం అన్నారు."దళారీ వ్యవస్థ లేకుండా చేసి రైతులకు మేలు చేశాం. గతంలో ఎన్నడూ జరగని మంచి ఇప్పుడు రైతులకు జరుగుతుంది. నాలుగేళ్లుగా ప్రతి అడుగూ రైతన్నల కోసమే వేశాం రైతులను చంద్రబాబు గాలికొదిలేశారు. చంద్రబాబు, దత్తపుత్రుడు రైతు బాంధవుల వేషం వేశారు. వారికి తోడుగా రావణ సైన్యంగా ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5 నిలిచాయి. రూ.87,612 కోట్లు మాఫీ చేస్తానని మోసం చేసిన వ్యక్తి చంద్రబాబు. బ్యాంకుల్లో పెట్టిన బంగారం ఇంటికి రప్పిస్తామని చెప్పి మోసం చేశారు. రైతులను మోసం చేసిన పెద్ద మనిషిని ఒక్క మాట అడగరు. ప్రశ్నిస్తామని చెప్పిన వారు ప్రశ్నించడమే మానేశారు" అంటూ సీఎం దుయ్యబట్టారు."ఎన్నికలు దగ్గరపడుతున్నందున వీళ్లంతా రోడ్డెక్కారు. చంద్రబాబు స్క్రిప్ట్‌ను డైలాగ్‌లుగా మార్చిన ప్యాకేజీ స్టార్ ఒక వైపు.. బాబు, దత్తపుత్రుడి డ్రామాలు రక్తి కట్టించాలని ఎల్లో మీడియా తానా తందానా. డీబీటీ ద్వారా రూ.2.10 లక్షల కోట్లు నేరుగా జమ చేశాం. లంచాలు, వివక్షకు తావులేకుండా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందిస్తున్నాం. ప్రతి పేదవాడికి తోడుగా మన ప్రభుత్వం అడుగులు వేస్తోంది. చంద్రబాబుకు ఓటు వేస్తే సంక్షేమ పథకాలు ఆగినట్టే. చంద్రబాబు ప్రభుత్వం వస్తే సంక్షేమ? పథకాలు నిలిచిపోతాయి వీళ్ల విధానం డీపీటీ.. దోచుకో,పంచుకో, తినుకో" అంటూ సీఎం జగన్ మండిపడ్డారు.

## ఏపీ విభజన చట్టంలోని ఆస్తుల విభజన ఆలస్యంపై సుప్రీంకోర్టులో విచారణ



ఢిల్లీ: ఏపీ విభజన చట్టంలోని ఆస్తుల విభజన ఆలస్యంపై సుప్రీంకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. రూ.లక్షన్నర కోట్లకు పైగా ఆస్తుల విభజనపై తెలంగాణ తేల్చకపోవడాన్ని ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లింది.జస్టిస్ జె.కే. మహేశ్వరి, జస్టిస్ సుందరేషన్ ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది.విభజన చట్టం ప్రకారం ఆస్తులలో ఏపీకి 58% తెలంగాణకు 42 శాతం వాటా దక్కాలని, ఆస్తుల విభజనపై అవసరమైతే సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తిని మధ్యవర్తిగా నియమించాలని ఏపీ ప్రభుత్వం తరఫు న్యాయవాది వాదించారు. దీంతో ఈ ప్రతిపాదనపై కేంద్ర ప్రభుత్వ అభిప్రాయం ఏమిటి అని సుప్రీంకోర్టు అడిగింది. తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే దీనిపై తగిన సూచనలు తీసుకుంటామని కేంద్ర తరఫు న్యాయవాది నటరాజన్ సర్వోన్నత న్యాయస్థానానికి తెలిపారు.అనంతరం ఏపీ ప్రభుత్వ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేసేందుకు కేంద్రానికి నాలుగు వారాల గడువు ఇచ్చింది సుప్రీంకోర్టు. ఆ తర్వాత రెండు వారాల్లో రీజైండర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను జూలై నెలాఖరుకు వాయిదా వేసింది.

## హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు

**జివో నంబర్ 1 కొట్టివేతపై సోమిరెడ్డి**

అమరావతి,మే12 : ఏపీ హైకోర్టు తీర్పు జగన్ ప్రభుత్వానికి చెంప దెబ్బ అని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. జీవో నెం.1 పై హైకోర్టు ఇచ్చిన తీర్పుపై స్పందించిన ఆయన శుక్రవారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ.. ఏపీ ప్రభుత్వం తెచ్చిన నిరంకుశమైన జీవో నెం 1 ను హైకోర్టు కొట్టివేయడం శుభపరిణామమన్నారు. రాజకీయ పార్టీలు, ఉద్యోగ సంఘాలు, ప్రజలు



రోడ్లపై నిరసన, పాదయాత్రలు, సభలు పెట్టకూడదని.. దేశంలోని ఏ రాష్ట్రంలో లేనివిధంగా నిరంకుశపాలన ఏపీలో సాగుతోందని.. అందుకు నిదర్శనమే జగన్ రెడ్డి తెచ్చిన జీవో నెంబర్ 1 అని అన్నారు. ఈ నిరంకుశ జీవోను కొట్టివేస్తూ హైకోర్టు సంచలనాత్మక తీర్పు ఇచ్చిందని వ్యాఖ్యానించారు.ప్రజలు, ప్రతిపక్షాలు, ఉద్యోగ, కార్మిక సంఘాలు నిరసన తెలపకూడదు కానీ.. సీఎం జగన్ రెడ్డి రోడ్డుపైకి వస్తే బ్యారికేడ్లు కడతారని.. పచ్చని చెట్లు నరికేస్తారని తీవ్ర స్థాయిలో సోమిరెడ్డి మండిపడ్డారు. నెల్లూరు జిల్లా, కావలికి సీఎం జగన్ వస్తున్నారని.. మూడు రోజులుగా అధికారులు ఓవరాక్షన్ చేస్తున్నారని, సభాస్థలికి కనెక్ట్ అయ్యే మూడు రోడ్లలో చిరు వ్యాపారుల దుకాణాలను తొలగించారన్నారు. ట్రాఫిక్ కూడా ఆపేశారని, సెల్ ఫోన్లు పనిచేయకుండా టవర్లను నిలిపివేశారన్నారు. సీఎం జగన్ మోహన్ రెడ్డికి ప్రజల్లోకి వచ్చే దమ్ము లేకుండా పోయిందని, ఓ నియంతలా వ్యవహరిస్తున్నారని సోమిరెడ్డి విమర్శించారు. జీవో నెం 1ని కొట్టివేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పు సీఎం నిరంకుశ విధానాలకు చెంపదెబ్బ లాంటిదన్నారు. పచ్చి అబద్దాలు చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి ఇప్పటికైనా పశ్చాత్తాపపడి పాలన పద్ధతిగా సాగించాలని సోమిరెడ్డి సూచించారు.

## ఛలో సిద్దేశ్వరం కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

కర్నూలు, మే 12విభారె న్యూస్ : రాయలసీమలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని, సిద్దేశ్వరం వద్ద ఐకానిక్ తీగల బ్రిడ్జి కి బదులుగా 50 టీ యం. సి నిలువ సామర్థ్యంతో అలుగు నిర్మించాలని రాయలసీమ విద్యా వంతుల వేదిక డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా "సిద్దేశ్వరం జల జాగరణ దీక్ష " కు సంబంధించిన వాల్ పోస్టర్ ( గోడ పత్రిక) ను కర్నూలు లోని పి ఓ డబ్ల్యు కార్యాలయం లో నాయకులు విడుదల చేశారు. వేదిక కో కన్వీనర్ పాణి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమం లో ప్రజాస్వామ్య సంఘాల ఐక్య వేదిక కన్వీనర్ రామకృష్ణా రెడ్డి, రాయలసీమ విద్యార్థి సంఘాల నాయకులు రవి కుమార్, సీమ కృష్ణ, రైతుకూలీ సంఘం నాయకులు సుంకన్న, ఎస్ డి పి ఐ జిల్లా అధ్యక్షులు జహంగీర్, డి టి ఎఫ్ నాయకులు రత్నం ఏసేపు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దశాబ్దాల తరబడి రాయలసీమ ప్రాంతం అన్యాయానికి గురవుతూ వుందని, అధికారం లోకి వచ్చిన అన్ని పార్టీలు రాయలసీమకు ద్రోహం చేస్తూ ఉన్నాయన్నారు.

# కర్నాటకలో ఎవరు గెలుస్తారు?

**కౌంటింగ్‌కు భారీగా ఏర్పాట్లు చేసిన ఎన్నికల సంఘం**
**ఉదయం 8 నుంచి కౌంటింగ్ మొదలు**
**మధ్యాహ్నానికి తేలనున్న ట్రెండ్**
**తమ విధానాలు నచ్చేవారితో పొత్తు అన్న కుమారస్వామి**




బెంగళూరు,మే12 : కర్ణాటక శాసన సభ ఎన్నికల్లో ప్రజాతీర్పు ఎవరివైపు అన్నది నేడు తేలనుంది. 10న జరిగిన పోలిం గ్‌కు సంబంధించిన కౌంటింగ్ శనివారం ప్రారంభం కానుంది. ఈ మేరకు ఎన్నికల సంఘం విస్తృతం గా ఏర్పాట్లు చేసింది. ఉదయం 8గంటలకు కౌంటింగ్ ప్రారంభం కానుంది. రౌండ్లవారీగా ఫలితాలను ఎప్పటికప్పుడు ప్రకటించనున్నారు. మొత్తం 224 స్థానాలకు ఒకే దఫాలో కర్ణాటక అసెంబ్లీకి ఎన్నికలను కేంద్ర ఎన్నికల సంఘం 10న బుధవారం నిర్వహించింది. మొత్తం 5 కోట్ల మంది ఎవరికి ఓటు వేశారనేది కర్ణాటక రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా 58, 545 పోలింగ్ బూత్ లు ఏర్పాటు చేసి ఎన్నికలు నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 2,615 మంది అభ్యర్థులు తమ లక్ పరీక్షించుకున్నారు. 70 శాతానికి నమోదయినట్లుగా తెలుస్తోంది. కర్ణాటక మొత్తం ఒకే ఫేజ్‌లో ఎన్నికలు జరిగాయి. ఎక్కడా హింసాత్మక ఘటనలు చోటు చేసుకోలేదు. చెదురుమదులు ఘటనలు మినహా అంతా ప్రశాంతంగా జరిగాయి. ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా కూడా భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎవరికీ మెజార్టీ రాదని స్పష్టంగాఎగ్జిట్ పోల్స్ ఫలితాలు చెప్తుండటంతో 'కింగ్‌మేకర్' జేడీఎస్ తదుపరి ప్రభుత్వ ఏర్పాటు కోసం తన వంతు పాత్ర పోషించేందుకు సిద్ధమవుతోంది. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలతో చర్చలు జరిపేందుకు సిద్ధమేనని ప్రకటించింది. మే 10న జరిగిన ఎన్నికల ఓట్ల లెక్కింపు శనివారం జరగనుండటంతో ఆ రెండు ప్రధాన పార్టీల్లోనూ కొత్త ఆశలు చిగురించేలా చేసింది. కాంగ్రెస్ కాస్త ముందంజలో ఉంటుందని ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు చెప్పినప్పటికీ, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన 113 మంది ఎమ్మెల్యేల మద్దతు రాకపోవచ్చునని చెప్తున్నాయి. అయితే జేడీఎస్ కు 30 కన్నా తక్కువ స్థానాలు లభిస్తాయని చెప్తున్నాయి. అంటే తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటే అటు కాంగ్రెస్ అయినా, ఇటు బీజేపీ అయినా తప్పనిసరిగా జేడీఎస్‌ను మచ్చిక చేసుకోక తప్పదు. ఈ నేపథ్యంలో జేడీఎస్ అగ్ర నేత, కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమార స్వామి సింగపూర్ వెళ్లే ముందు ఓ వార్తా పత్రికతో మాట్లాడారు. జేడీఎస్ కనీసం 50 స్థానాల్లో గెలుస్తుందని నేను ఇప్పటికీ ధీమాగా ఉన్నాను. నా మాటలకు అంగీకారం తెలిపే పార్టీతో పొత్తు పెట్టుకోవడానికి నేను సిద్ధంగా ఉన్నానని అన్నారు. జేడీఎస్ వ్యవస్థాపకుడు, మాజీ ప్రధాన మంత్రి హెచ్‌డీ దేవె గౌడ ఇటీవల మాట్లాడుతూ, కాంగ్రెస్‌తో జేడీఎస్ కలిసే ప్రసక్తే లేదన్నారు.

## సీబీఎస్ఈ 10,12 తరగతుల పరీక్షా ఫలితాల విడుదల

**ఈ రెండు పరీక్షల్లోనూ బాలికలదే పైచేయి**

న్యూఢిల్లీ మే 12 సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (అబాఇ) పదో తరగతి, పన్నెండో తరగతి పరీక్షల ఫలితాలు శుక్రవారం వెలువడ్డాయి. ఈ రెండు పరీక్షల్లోనూ బాలికలదే పైచేయిగా నిలిచింది. ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో పరీక్షలు రాసిన విద్యార్థినీ, ద్యార్థులు ని ద్వారా తమకు లభించిన మార్కులను తెలుసుకోవచ్చు. లాగిన్ క్రెడెన్షియల్స్‌గా రోల్ నంబరు, స్కూల్ నంబరు, అడ్మిట్ కార్డ్ ఐడీలను ఉపయోగించాలి.సీబీఎస్ఈ పన్నెండో తరగతి ఫలితాల్లో త్రివేండ్రం 99.91 శాతం ఉత్తీర్ణతతో ప్రథమ స్థానంలో నిలిచింది. ఉత్తర ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ 78.05 శాతంతో ఈ జాబితాలో అట్టడుగున ఉంది.మెరిట్ లిస్ట్ లేదుపదో తరగతి, పన్నెండో తరగతి విద్యార్థినీ, విద్యార్థుల ఉత్తీర్ణతకు సంబంధించిన మెరిట్ లిస్ట్‌ను ప్రచురించరాదని సీబీఎస్ఈ నిర్ణయించింది. అనారోగ్యకరమైన పోటీని నివారించేందుకు ఈ చర్య తీసుకుంది. అదేవిధంగా ఫస్ట్ డివిజన్, సెకండ్ డివిజన్, థర్డ్ డివిజన్‌లను కూడా ఇవ్వకూడదని నిర్ణయించింది.సబ్జెక్టుల్లో అత్యధిక మార్కులు స్కోర్ చేసిన 0.1 శాతం మంది విద్యార్థినీ, విద్యార్థులకు మెరిట్ సర్టిఫికేట్లను ఇవ్వాలని నిర్ణయించింది.సీబీఎస్ఈ పదో తరగతి పరీక్షలకు మొత్తం 21,84,117 మంది రిజిస్టర్ చేయించుకున్నారు. వీరిలో 21,65,805 మంది పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 20,16,779 మంది ఉత్తీర్ణులయ్యారు. అంటే 93.12 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. పదో తరగతిలో 44,297 మందికి 95 శాతం కన్నా ఎక్కువ మార్కులు పొందారు. 1,95,799 మంది 90 శాతం కన్నా ఎక్కువ మార్కులు పొందారు. పదో తరగతి పరీక్షల్లో బాలికలదే పైచేయి అయింది. ఈ పరీక్షల్లో బాలురు 92.27 శాతం మంది, బాలికలు 94.25 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. సీబీఎస్ఈ పన్నెండో తరగతి పరీక్షల్లో త్రివేండ్రం రీజియన్ (99.91 శాతంతో) ప్రథమ స్థానంలో నిలిచింది. రెండో స్థానంలో బెంగళూరు, మూడో స్థానంలో చెన్నై నిలిచాయి. గౌహతి చివరి స్థానంలో ఉంది.ఇదిలావుండగా, సీబీఎస్ఈ పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం గత ఏడాది కన్నా 1.28 శాతం తగ్గింది. గత ఏడాది 94.40 శాతం మంది ఉత్తీర్ణులు కాగా, ఈ ఏడాది 93.12 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు.

పన్నెండో తరగతిలో తగ్గిన ఉత్తీర్ణత శాతం సీబీఎస్ఈ పన్నెండో తరగతి పరీక్షల్లో ఢిల్లీ విద్యార్థినీ, విద్యార్థుల ఉత్తీర్ణత శాతం తగ్గిపోయింది. 2022లో 96.29 శాతం మంది ఉత్తీర్ణులు కాగా, 2023లో 92.21 శాతం మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. ఢిల్లీ నుంచి 3,51,462 మంది ఈ పరీక్షలకు హాజరుకాగా, 3,24,094 మంది ఉత్తీర్ణులయ్యారు.

సీబీఎస్ఈ పన్నెండో తరగతి పరీక్షా ఫలితాలను తెలుసుకోవాలంటే, రోల్ నంబర్, స్కూల్ నంబర్, అడ్మిట్ కార్డ్ ఐడీ, పుట్టిన తేదీ ఉండాలి.

# సంపాదకీయం

శనివారం 13-05-2023

## ఐక్యత ఎండమావేనా...

కర్నాటక ఎన్నికల్లో విపక్షాలు ఎవరికి వారే యమునాతీరే అన్న చందంగా సాగుతున్నారు. విపక్షాల ఐక్యత గురించి మాట్లాడుతున్న కెసిఆర్, బీహార్ సిఎం నితీశ్ కుమార్, బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, లెఫ్ట్ నేతలు ఎవరూ కూడా ఇక్కడ బిజెపిని ఓడించేందుకు కలసికట్టుగా పోరాడుదామన్న సంకల్పాన్ని ప్రకటించలేదు. అంతకు ముందు జరిగిన పలు రాష్ట్రాల ఎన్నికల్లోనూ ఇదే తీరు కొనసాగింది. వె?డీ, బీజేపీ కోరుకుంటున్న విధంగానే విపక్షాలు ఐక్యతకు దూరంగా ఉంటూ ప్రజలకు అదే సంకేతాన్ని యిస్తున్నాయి.అంతెందుకు ఢిల్లీ కేంద్రంగా మహిళా రెజ్లర్లు ఆందోళన చేస్తున్నా వారికి అండగా నిలిచి పోరాడాలన్న కనీస జ్ఞానం కూడా విపక్షాల్లో లోపించింది. ఈ ఒక్క విషయం చాలు బిజెపిని నిలదీయడానికి కానీ సమస్యలపై పోరాడేందుకు కానీ విపక్షాలకు చిత్తశుద్ధి కొరవడిందని జనం భావించడానికి. ఏదో వెళ్లామా అంటే వెళ్లామన్న తీరులో కొందరు వెళ్లి రెజ్లర్లకు మద్దతు ప్రకటించారే తప్ప జాతీయ, అంతర్జాతీయ వేదికలపై భారత్ కీర్తి పతాకను రెపరెపలాడించిన కుస్తీ వీరులకు అండగా ఉద్యమించడంలో మాత్రం పూర్తిగా విస్మరించారు. రెజ్లర్లపై ఢిల్లీ పోలీసులు అమా నుషంగా ప్రవర్తించారు. జంతర్‌మంతర్ వద్ద శాంతియుతంగా ఆందోళన చేస్తున్న రెజ్లర్లపై లాఠీ ఝుళిపిం చారు. పోలీసులు తప్ప తాగి విర్రవీగారని రెజ్లర్లు ఆరోపిస్తుండగా.. బీజేపీ వైఫల్యం వల్లే ఈ ఘటన జరిగిం దంటూ విపక్షాలు దుమ్మెత్తి పోశాయి. ఢిల్లీ మహిళా కమిషన్ కూడా ఈ ఘటనపై సీరియస్ అయ్యింది.రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఎఫ్ఐ) చీఫ్, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ తమను లైంగికంగా వేధిస్తున్నాడంటూ ఓ మైనర్ సహా.. పలువురు మహిళా రెజ్లర్లు కొంతకాలంగా ఆందోళన చేస్తున్నారు. తమకు న్యాయం చేయాలంటూ ఏప్రిల్ 23 నుంచి వారు జంతర్‌మంతర్ వద్ద ఆందోళన చేస్తున్నారు. వారికి దిగ్గజ కుస్తీవీరులు, మాజీ రెజ్లర్లు మద్దతు ప్రకటిస్తూ ఆందోళనలో పాల్గొంటున్నారు. అయినా ఆ బిజెపి ఎంపిపై చర్య తీసుకోవాలని, మహిళా రెజ్లర్లకు మద్దతుగా ఉమ్మడిగా పోరాడాలన్న చలనం విపక్షాల్లో కానరావడం లేదు. ఈ విషయాన్ని అంతా కలసి మహిళా రాష్ట్రపతి ముందుకు తీసుకుని వెళ్లవచ్చు. నిజానిజాలను విచారించాలని కోరవచ్చు. బిజెపి ఎంపిపై చర్యలకు గట్టిగా పట్టుబట్టే అవకాశం ఉన్నా.. విపక్ష పార్టీలు పెద్దగా సీరియస్‌గా తీసుకోవడం లేదు. మహిళా రెజ్లర్లకు అండగా పోరాడాలన్న కనీస నైతికతను కూడా మహిళా ఎంపిలు కనబర్చడం లేదు. ఎందుకంటే వారికి రాజకీయాలను మించిన సమస్య మరోటి లేదు కనుక..కర్నాటకలో బిజెపి గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోందని చెబుతున్నా విపక్ష నేతలు కలసి పని చేయడానికి ముందుకు రాలేదు. కర్నాటకలో కాంగ్రెస్, జెడిఎస్ ఎవరికి వారే అన్నట్లుగా పోటీ చేస్తున్నారు. ఇదే ఇప్పుడు బిజెపికి కలసివచ్చేదిగా ఉంది. అక్కడ డబుల్ ఇంజన్ సర్కార్ నడుస్తున్నా...కర్నాటకలో నేతలు అవినీతి లో కూరుకుపోయారు. బిజెపి అవినీతిని ఎలుగెత్తాల్సిన పార్టీలు ఉమ్మడి కార్యాచరణ చేయడం లేదు. ఎందుకంటే అవినీతిలో అన్ని పార్టీల నేతలదీ ఒకటే దారి. మరోవైపు జాతీయ రాజకీయాలలో కాంగ్రెస్ పార్టీ పెద్దన్న పాత్ర పోషించడాన్ని పలు ప్రాంతీయ పార్టీలు అంగీకరించే పరిస్థితిలో లేవు. అయితే కాంగ్రెస్ పార్టీ ఈ విషయంలో రాజీ ధోరణి అవలంబించడానికి సిద్ధంగానే ఉంది. కాంగ్రెస్, బీజేపీలకు సమదూరం అంటూ కేసీఆర్, మమతా బెనర్జీ, కేజ్రీవాల్ వంటివారు ప్రకటిస్తూనే ఉన్నారు. రాహుల్ గాంధీకి సంఘీభావం తెలపడం కోసం కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన సమావేశానికి ఈ మూడు పార్టీల ప్రతినిధులు కూడా హాజరయ్యారు. ఈ పరిస్థితుల్లో బీజేపీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాలన్నీ సంఘటితం కావాలంటే జయప్రకాశ్ లాంటి అనుసంధానకర్త కావాలి. లేరు ప్రధాని పదవిని కోరుకుంటున్న వారే. కర్నాకటలో కూడా కుమారస్వామి, సిద్ధరామయ్య, డికె శివకుమార్ తదితరులంతా సిఎం పదవిపై కన్నేసిన వారే. అందుకే విపక్షాల ఐక్యత అన్నది ఎండమావిగా మారుతోంది. నిజానికి కాంగ్రెస్ లేకుండా ప్రతిపక్షాల ఐక్యత సాధ్యం కాదు. ఆ విషయం అన్ని పార్టీలకు తెలుసు. అన్ని పార్టీలు కూడా కాంగ్రెస్ మద్దతుతో ప్రధాని గద్దెపై ఒక్కసారయినా ఎక్కాలని చూస్తున్నవే. ఇలా చేసే చరణ్ సింగ్, చంద్రశేఖర్, విపిసింగ్ లాంటి వారు ప్రధాని పదవిని అధిష్టించినా..దేశాన్ని పాలించే సత్తా లేదని నిరూపిం చుకున్నారు. ఒకవేళ కలిసినట్టు కనిపించినా ప్రస్తుతం వె?డీ నాయక్తంలో ఉన్న బీజేపీని దీటుగా ఎదుర్కొనే పరిస్థితి కానరావడం లేదు.కాంగ్రెస్ పార్టీ కూడా నిస్వార్థంగా పోరాడాలన్న సంకల్పాన్ని మరింత గట్టిగా ప్రకటించాల్సిన అవసరం ఉంది. గాంధీ నెహ్రూకుటుంబం బయటి వ్యక్తిని పార్టీ అధ్యక్ష పదవిని కట్టబెట్టడం ద్వారా కాంగ్రెస్ ఒక అడుగు వేసింది. దానిని అందిపుచ్చుకుని బీజేపీయేతర పార్టీలు అడుగు కలపాల్సిన, కదపాల్సిన అవసరం ఉంది. అది జరగనంత వరకూ విపక్షాల ఐక్యత ఎండమావిగానే ఉంటుంది.

# వెల్లంపల్లి వర్సెస్ కొట్టు సత్యనారాయణ

విజయవాడ, మే 12, దేవాదాయ శాఖలో ప్రతి వ్యవహారం మంత్రి వర్సెస్ మాజీ మంత్రి అన్నట్టుగానే తయారవుతోంది. దుర్గగుడిలో ఆధిపత్యం కోసం జరుగుతున్న ఈ వర్గపోరు తాజాగా ఉద్యోగి నగేష్ అరెస్టుతో తెరమీదకు వచ్చింది. సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న వాసా నగేష్‌ను ఆదాయానికి మించి ఆస్తుల కేసులో ఇటీవల ఏసీబీ అరెస్టు చేసింది. గతంలో ద్వారకా తిరుమలలో ఉద్యోగం చేసినపుడు కూడా నగేష్ పై పలు ఫిర్యాదులు వచ్చి శాఖాపరమైన చర్యలు తీసుకున్న చరిత్ర ఉంది. అలాంటి వ్యక్తికి గుడిలో కీలక బాధ్యతలు ఎలా ఇచ్చారన్నది క్వశ్చన్. పాలక మండలి సమావేశంలో చర్చించి.. నగేష్‌కు బాధ్యతలు ఇవ్వవద్దని ఈఓ భ్రమరాంభకు చెప్పినా.. ఆమె అస్సలు పట్టించుకోలేదన్నది బోర్డ్ సభ్యుల ప్రధాన ఆరోపణ. ఇక్కడి వరకు పాలకమండలి వర్సెస్ ఈఓగా మాత్రమే నడిచిన వ్యవహారం సీన్ కట్ చేస్తే సీఎంవోకి చేరింది.ఈవో భ్రమరాంభ అవినీతిపై విచారణ జరిపించాలని పాలకమండలి ఛైర్మన్ రాంబాబు సీఎం జగన్ ను కలిసి వినతిపత్రం ఇవ్వటం ఆలయ వర్గాల్లో తీవ్ర చర్చకు కారణమైంది. ఛైర్మన్ మీడియా సమావేశం పెట్టి మరీ? ఈఓపై విచారణకు డిమాండ్ చేశారు. దేవాదాయ శాఖ మంత్రిగా కొట్టు సత్యనారాయణ ఉన్నప్పటికీ పాలకమండలి ఆయనకు ఫిర్యాదు చేయలేదు. కమిషనర్ కు కూడా చెప్పకుండా నేరుగా సీఎంకి వెళ్ళడం కలకలం రేపింది. పాలకమండలి ఛైర్మన్ రాంబాబు? మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్ వర్గంగా ఉన్నారు. వెల్లంపల్లి కనుసన్నల్లోనే కొత్త పాలక మండలి ఏర్పాటైంది. తన నియోజకవర్గ పరిధిలో ఉన్న దుర్గగుడిపై ఆధిపత్యం కోసం వెల్లంపల్లి, ఆ శాఖ మంత్రిగా ఉన్న కొట్టు సత్యనారాయణ మధ్య కోల్డ్ వార్ జరుగుతోంది. ఇదే టైంలో ఉద్యోగి నగేష్ ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్ట్ కావటంతో వెల్లంపల్లి వర్గం టైం చూసి దెబ్బకొట్టిందట. నగేష్ దగ్గర భారీగా ఆస్తులు పట్టుబడటంతో.. పాలకమండలి నేరుగా సీఎంకు ఫిర్యాదు చేయటం, ఈఓపై విచారణ చేయాలనటం ద్వారా

మంత్రిని ఇబ్బంది పెట్టే ప్రయత్నం జరుగుతోందట.దేవాదాయ శాఖ మంత్రిగా ఉన్న తనను కాదని? దుర్గగుడి ఈఓపై సీఎంకు నేరుగా ఫిర్యాదు చేయటం మంత్రి కొట్టుకు ఆగ్రహం తెప్పించిందట. పాలక మండలి ఏర్పాటైన మూడు నెలలకే బాగా పనిచేయాలన్న అత్యుత్సాహంతో ఉన్నారని కామెంట్ చేశారు కొట్టు. ఆలయంపై ఆధిపత్యం కోసం కాకుండా నియమ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలంటూ పాలకమండలికి చురకలు వేశారు. పాలక మండలి ఫిర్యాదు చేసిన ఈఓ భ్రమరాంభ సమర్థంగా పనిచేస్తున్నారని, తప్పు చేసే ప్రతి ఉద్యోగికి ఈవో బాధ్యులవుతారా అన్నది ఆయన క్వశ్చన్. సీఎంకు ఫిర్యాదు చేసినా ఆయన తిరిగి తన దగ్గరకే పంపి చర్యలు తీసుకోమంటారంటూ వెలంపల్లి వర్గానికి షాక్ ఇస్తున్నారు మంత్రి. దుర్గమ్మ సాక్షిగా జరుగుతున్న ఈ వర్గపోరు ఎటు దారితీస్తుందో? ఎవరు పై చేయి సాధిస్తారో చూడాలి.

# నెల్లూరులో ఆసక్తికరంగా పాలిటిక్స్

నెల్లూరు, మే 12, నెల్లూరు జిల్లాలో రాజకీయాలు ఆసకికరంగా మారాయి. మొన్నటి వరకు రాజకీయ ప్రత్యర్థులుగా ఉన్న నేతలు భేటీ అయ్యారు. ఈ పరిణామాలు జిల్లాలో ఆసక్తికరంగా మారాయి. ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డితో దుత్తలూరులో సమావేశం అయ్యారు. కంభంతో మేకపాటి భేటీ ఆసక్తికరంగా మారింది.. ఇద్దరు నేతలు దాదాపు రెండు గంటలకుపైగా భేటీ అయ్యారు. తాజా రాజకీయాలపై ఇద్దరు చర్చించుకున్నారు.తాను, మేకపాటి గత ముప్పై ఏళ్లుగా రాజకీయంగా ప్రత్యుర్థులుగా ఉన్నామన్నారు కంభం విజయరామిరెడ్డి. నియోజకవర్గ అభివృద్ధిలో కంభంతో కలిసి నడుస్తానన్నారు మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి. ప్రస్తుతం తాను ఇండిపెండెంట్ ఎమ్మెల్యేగా ఉన్నానని.. ఈ నియోజక వర్గంలో కంభం విజయ రామిరెడ్డి, తాను ప్రతి ఒక్కరికీ తెలుసు అన్నారు. విజయరామిరెడ్డితో కలసి ఉదయగిరి నియోజక వర్గ అభివృద్ధికి కృషి చేస్తాను అన్నారు.మొన్నటి వరకు రాజకీయ ప్రత్యర్థులుగా ఉన్న నేతలు ఉన్నట్టుండి సమావేశం కావడం రాజకీయంగా ప్రాధాన్యత ఏర్పడింది. మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి టీడీపీలో చేరతారనే చర్చ జరుగుతోంది. దీంతో ఉదయగిరి టీడీపీలో రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. ఇప్పటికే ఉదయగిరి టీడీపీ ఇంఛార్జ్‌గా బొల్లినేని రామారావు ఉన్నారు. ఒకవేళ మేకపాటి టీడీపీలోకి వస్తే టికెట్ ఎవరికి ఇస్తారనే చర్చ మొదలైంది. మేకపాటి కూడా టికెట్ విషయంలో మద్దతు కోసం కంభం విజయరామిరెడ్డిని కలిశారా అనే చర్చ జరుగుతోంది.ఇటు వైఎస్సార్‌సీపీ కూడా ఇప్పటి వరకు ఉదయగిరి నియోజకవర్గానికి ఇంఛార్జ్‌ను నియమించలేదు. ఈ రేసులో మేకపాటి అభినయ్ రెడ్డి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఆయనకు బాధ్యతలు అప్పగిస్తారని చర్చించుకుంటున్నారు. మరో ఒకటి రెండు పేర్లు వినిపిస్తున్నా.. మేకపాటి కుటుంబానికే టికెట్ ఇస్తారని పొలిటికల్ సర్కిల్స్‌లో చర్చ జరుగుతోంది. ఇప్పటికే మేకపాటి ఫ్యామిలీ ఉదయగిరిపై ఫోకస్ పెట్టింది.. పార్టీ నేతలు చేజారి పోకుండా జాగ్రత్త పడుతోంది.ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీకి అనుకూలంగా ఓటు వేశారనే ఆరోపణలతో ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ సస్పెండ్ చేసింది. ఆయనతో పాటూ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రాంనారాయణరెడ్డిపై కూడా వేటు పడింది. ఆ తర్వాత ఉదయగిరిలో స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలతో సవాళ్లు, ప్రతిసవాళ్లతో రాజకీయాలు వేడెక్కాయి. మళ్లీ చాలా రోజుల తర్వాత చంద్రశేఖర్ రెడ్డి రాజకీయాల్లో బిజీ అయ్యారు. కంభం విజయరామిరెడ్డితో భేటీ అయ్యారు.

# విశ్వమంతా వ్యాపించిన తిరుపతి గంగ జాతర

**శ్రీ తాతయ్యగుంట గంగమ్మకు సారె సమర్పించిన మేయర్ డాక్టర్ శిరీష కుటుంబ సభ్యులతో కలిసి మొక్కులు తీర్చుకున్న శిరీష**

తిరుపతి తిరుపతిలోని శ్రీ తాతయ్యగుంట గంగమ్మకు శుక్రవారం ఉదయం మేయర్ డాక్టర్ శిరీష కుటుంబ సభ్యులతో సారె సమర్పించారు. స్థానిక పెద్దకాపు లేఅవుట్ లోని తన నివాసం వద్ద పూజలు నిర్వహించిన అనంతరం తిరుపతి శాసనసభ్యులు భూమన కరుణాకర్ రెడ్డి, కుటుంబ సభ్యులు, నగరపాలక ఉపమేయర్లు, కార్పొరేటర్లు, బంధువులు, అభిమానులతో కలిసి ఊరేగింపుగా బయలుదేరారు. కోలాటాలు, డప్పులు, సప్పరాలు సన్నాయి వాయిద్యాల మధ్య, భక్తులు విచిత్ర వేషధారణలతో, కుటుంబ సభ్యులు ఆలయ ప్రదక్షిణ గా వెళ్లి గర్భాలయంలో అమ్మవారికి శేష వస్త్రాలు, పసుపు కుంకుమలతో కూడిన గంగమ్మకు పట్టువస్త్రాలతో సారెను సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆశీర్వాదాలు అందజేశారు. గంగమ్మ ఆలయ పాలకమండలి చైర్మన్ కట్ట గోపి యాదవ్, ఈవో, అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మీడియాతో మాట్లాడుతూ మే 9వ తేదీన చాటింపు మొదలైన గంగమ్మ జాతర17వ తేదీ బుధవారం వరకు జరుగనున్న విషయం తెలిసిందే. తిరుపతి గంగజాతర విశ్వమంతా వ్యాపించిన తిరుపతి గంగమ్మ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిందని తెలిపారు. తిరుపతి శాసనసభ్యులు భూమన కరుణాకర్ రెడ్డి ఆధ్వర్యంలో తిరుపతి అంగరంగ వైభవంగా గంగమ్మ జాతర ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అలాగే తిరుపతి శ్రీ తాతయ్య గుంట గంగమ్మ జాతరను రాష్ట్ర పండగ గుర్తిస్తూ, ఇకనుంచి అధికారకంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలియజేశారు. తిరుపతి గంగమ్మ జాతర కు 1400 సంవత్సరాల చరిత్ర ఉందని పెద్దలు అందరూ తెలిపారు అని తెలియజేశారు. గంగమ్మ తల్లి సాక్షాత్తు శ్రీ కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామికి సోదరి అని తెలిపారు. ప్రతి ఒక్కరు జాతరలో పాల్గొని అమ్మవారికి మొక్కులు తీర్చుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో తిరుపతి శాసనసభ్యులు భూమన కరుణాకర్ రెడ్డి దంపతులు, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, నగరపాలక మేయర్ డాక్టర్ శిరీష దంపతులు డాక్టర్ మునిశేఖర్, కమిషనర్ హరిత, కుటుంబ సభ్యులు తులసి,సురేష్, ఉప మేయర్లు భూమన అభినయ్, ముద్ర నారాయణ, కార్పొరేటర్లు, నగరపాలక అధికారులు అదనపు కమిషనర్ సునీత,ఉప కమిషనర్ చంద్రమౌళీశ్వర రెడ్డి,యస్.ఈ. మోహన్, హెల్త్ ఆఫీసర్ హరికృష్ణ, మున్సిపల్ ఇంజనీర్లు, ఆర్.ఓ. వర్మ, వివిధ హాస్పిటల్ డాక్టర్లు, గంగమ్మ ఆలయ పాలకమండలి అధ్యక్షులు కట్టా గోపి యాదవ్, ఈవో మునికృష్ణ, వైయస్సార్ సిపి నాయకులు దొడ్డ రెడ్డి సిద్ధారెడ్డి, ప్రతాప్ రెడ్డి, భారీ ఎత్తున నగర ప్రజలు పాల్గొన్నారు.

# ఏపిలో మళ్లీ దంచికొడుతున్న ఎండలు




విజయవాడ,మే12(ఆర్ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్‌లో వర్షాలకు బ్రేక్ పడింది. వాతావరణం మారిపోయి.. మళ్లీ ఎండలు, వేడి గాలులు మొదలయ్యాయి. మే 13 నుంచి పలు ప్రాంతాల్లో తీవ్రవడగాలులు వీచే అవకాశం ఉంది అని విపత్తుల నిర్వహణ సంస్థ (ఎఓఆ) తెలిపింది. మిగిలిన చోట్ల ఎండ ప్రభావం చూపే అవకాశం ఉందని.. ప్రజలు ఎండ తీవ్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని వాతావరణ అధికారులు సూచించారు. ఆంధప్రదేశ్ లో మే 13 నుంచి ఉత్తర కోస్తా, యానాం,దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్‌లో వేడిగాలులు వీచే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది . శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, పల్నాడు, విజయనగరం, తిరుపతి, తూర్పుగోదావరి, ప్రకాశం, తూర్పుగోదావరి, కర్నూలు జిల్లాల్లోని కొన్ని మండలాల్లో మే నెలలో పగటి ఉష్ణోగ్రతలు 42 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదయ్యే అవకాశం ఉందని ఆంధప్రదేశ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ (ఏపీఎస్‌డీఎంఏ) వెల్లడించింది. తాజాగా పల్నాడు జిల్లా రెంటచింతల, కడపలో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని ఏపీ వాతావరణ శాఖ ప్రకటించింది. ఇంకా ఎండలు మండిపోతాయని.. ఈ నెల 13నాటికి 44 డిగ్రీల నుంచి 45 డిగ్రీల వరకు టచ్ అవుతుందని అంచనా వేశారు.

**మరింతగా పెరిగే ప్రమాదం ఉందన్న ఐఎండి**

చాలా జిల్లాల్లో ఇదే పరిస్థితి ఉంటుంది అంటున్నారు. ఎండలకు తోడు వేడి గాలులు వీస్తాయంటున్నారు. . మొన్నటి వరకు చల్లగా ఉన్న వాతావరణంతో ఎంజాయ్ చేసిన జనాలు.. ఉన్నట్టుండి పెరిగిన ఉష్ణోగ్రతలతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు 40 నుంచి 41 డిగ్రీలకు పెరిగింది. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున.. వృద్ధులు, చిన్నపిల్లలు జాగ్రత్తగా ఉండాలని సూచించింది.

# మామిడిపండ్ల ధరలు రెట్టింపు

**దిగుబడుల తగ్గడంతో పెరిగిన ధరలు**

విజయవాడ,మే12(ఆర్ఎన్ఎ): మామిడిపండ్ల ధరలు బేజారెత్తిస్తున్నాయి. సీజన్ ఆరంభమై ఇప్పుడిప్పుడే మార్కెట్లోకి మామిడిపండ్ల రాక మొదలవడంతో డిమాండ్ ఏర్పడి ధరలు చుక్కలనంటుతున్నాయి. హైదరాబాద్‌లో బంగినపల్లి మామిడి పళు కిలో కనీసం వందకు తక్కువగా అమ్మడంలేదు. దీనికితోడు ఎక్కడా పెద్దగా పండ్ల బండ్లు అమ్మకానికి రావడం లేదు. ఈ యేడు పంట దిగుబడులు తగ్గడం బంగినపల్లి, చెరకురసాలు, పందారకల్తీ.. ఇలా ఏ రకమైనా సరే ధర అందనంతగా ఉంది. ఇటీవలి అకాల వర్షాలకు మామిడి రాలిపోయింది. విజయవాడ, కాకినాడ తదితర ప్రాంతాల్లో కాస్త పెద్దసైజువి బంగినపల్లి పరక రూ.500పైనే చెబుతున్నారు. చెరకురసాలు, పందార కల్తీ పరక రూ.350 వరకూ చెబుతున్నారు. దీంతో ధనికవర్గాలకు తప్ప సామాన్యులకు మామిడిపండ్లు ఇప్పట్లో దొరికే పరిస్థితి లేదు. రాజమహేంద్రవరం కోరుకొండ రోడ్డులోని మార్కెట్‌యార్డు వద్ద ప్రతి ఏటా మామిడిపండ్ల మార్కెట్ జరుగుతుంది. చుట్టుపక్కల ప్రాంతాలైన కోరుకొండ, నల్లగొండ, కోటి, గోకవరం, రంపయర్రంపాలెం, గంగంపాలెం, తిరుమలాయిపాలెం, జగ్గంపేట తదితర ప్రాంతాల నుంచి ఇక్కడకు మామిడిపండ్లు ఎక్కువగా తెస్తుంటారు

# గంటకు 250 కాల్స్

విజయవాడ, మే 12, వైసీపీ ప్రభుత్వం కొత్తగా ప్రారంభించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. అంటే యిదేదో జగన్ కు జనాదరణ బ్రహ్మాండంగా ఉందనడానికి తార్కానంఎంత మాత్రం కాదు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం ఏమిటంటే జనాలు తమ సమస్యలను ప్రభుత్వానికి నివేదించుకునే అవకాశం యివ్వడమే. ఈ కార్యక్రమం కోసం ప్రభుత్వం ఒక టోల్ ఫ్రీ నంబర్ ను కేటాయించింది.ఆ నంబర్ కే కాల్స్ వెల్లువెత్తాయి. రమారమి గంటకు250 చొప్పున కాల్స్ వస్తున్నాయి. అంటే జగన్ నాలుగేళ్ల కాలంలో సమస్యలు ఎంతగా పేరుకుపోయాయి అన్నది ఈ కాల్స్ ను బట్టే అవగతమౌతోంది. జనాలు ఈ టోల్ ఫ్రీ నంబర్ కు ఫోన్ చేసి చెప్పుకుంటే.. వారి సమస్య అలా పరిష్కారం అయిపోతుందన్నంత రేంజ్ లో ప్రచారం చేశారు. దీంతో జగన్ పాలనలో పేరుకుపోయిన సమస్యలపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. నాలుగు గంటల్లో వెయ్యిమంది ఫిర్యాదులు చేశారంటేనే సమస్యలు ఏ స్థాయిలో పేరుకుపోయాయన్నది అర్థమైపోతోంది. నిజానికి ప్రజా సమస్యల పరిష్కారాలకే ప్రభుత్వ యంత్రాంగం ఉన్నది.గ్రామస్థాయి నుండి సెక్రటేరియట్ లో పనిచేసే అత్యున్నత స్థాయి అధికారులందరు ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలి. అయితే జగన్ హయాంలో ఆ దిశగా పనులు జరగడం లేదనడానికి జగనన్నకు చెబుతాం కార్యక్రమానికి ఈ స్థాయిలో ఫిర్యాదులు వెల్లువెత్తడమే నిదర్శనం. రోడ్లు ,ఆరోగ్య కేంద్రాల పనితీరు, ఫించన్లు, రేషన్ వంటి సమస్యలే అధికంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై సందేహాలు, అనుమానాలూ వ్యక్తమౌతున్నాయి. పాలనలో నాలుగేళ్లు పూర్తయ్యాయి. మరి నాలుగేళ్లలో చేయనిది, చేయలేనిదీ.. ఒక్క ఫోన్ కాల్ కు స్పందించి జగన్ ప్రభుత్వం చేస్తుందా అన్న అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. రాష్ట్రంలో అభివృద్ధే కాదు.. సంక్షేమం కూడా అందని ద్రాక్షగానే మారిందన్న విమర్శలూ వెల్లువెత్తుతున్నాయన్నది కేవలం విమర్శే కాదు.. కాదనలేని వాస్తవం.

# అంబటి వైసీపీలో చేరే సూచనలు

విజయవాడ, మే 12ఆంధ్రప్రదేశ్‌కి చెందిన ప్రముఖ క్రికెటర్ అంబటి రాయుడు అధికార వైసీపీలో చేరే సూచనలు నిండుగా కనిపిస్తున్నాయి. కొన్ని రోజుల క్రితమే సీఎం వైయస్ జగన్ ప్రసంగాన్ని రీట్వీట్ చేసి చర్చనీయాంశంగా మారిన రాయుడు.. ఇప్పుడు తాడేపల్లిలో సీఎం క్యాంపు కార్యాలయానికి చేరుకున్నాడు. ఈ క్రమంలోనే నేరుగా ముఖ్యమంత్రి జగన్తో భేటి అయిన రాయుడు ఆయనతో ఏం మాట్లాడాడనేది ఇంకా తెలియరాలేదు.గుంటూరు జిల్లాకు చెందిన రాయుడు 2013-19 మధ్యకాలంటో భారత జట్టుకు ఆడాడు. ఆ తర్వాత జాతీయ క్రికెట్ నుంచి విరామం తీసుకుని ఐపీఎల్‌లో కొనసాగుతున్నాడు. ఈ క్రమంలోనే కొన్నిరోజుల కిందట సీఎం జగన్ శ్రీకాకుళం జిల్లా మూలపేట పోర్టుకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జగన్ ప్రసంగించగా, ఆ స్పీచ్‌ను అంబటి రాయుడు రీట్వీట్ చేశారు. అంతేకాక 'ఏపీలో ప్రతి ఒక్కరికీ మీపై విశ్వాసం ఉంది సార్' అంటూ క్యాప్షన్ కూడా రాసుకొచ్చాడు. అంతలోనే నేడు సీఎం జగన్‌తో భేటీ అయ్యాడు. దీంతో రాయుడు రాజకీయాలలోకి రంగప్రవేశం చేస్తున్నాడేమోనని సర్వత్రా చర్చ సాగుతోంది.గుంటూరులో పుట్టిన అంబటి రాయుడు రాజకీయాల్లోకి రావాలని చాన్నాళ్ల నుంచి ఆలోచిస్తున్నారు. ప్రజలకు సేవ చేసేందుకు ఇదే ఉత్తమ మార్గం అనుకుంటున్నానని కొందరిని కలిసిన తర్వాత తుది నిర్ణయం చెబుతానంటున్నారు. ఏ పార్టీలో చేరాలన్నది కూడా అప్పుడే తెలుస్తుంది' అని రాయుడు చెప్పాడు. హైదరాబాద్‌లో క్రికెటర్ కెరీర్ స్టార్ట్ చేసినప్పటికీ తెలంగాణలో కాకుండా ఏపీలోనే పొలిటికల్ ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ఏపీలో బలమైన కాపు వర్గానికి చెందిన రాయుడు తన సొంత జిల్లా అయిన గుంటూరు నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో బరిలోకి దిగే అవకాశం కనిపిస్తోంది. అయితే ఏ పార్టీ అన్నదానిపై స్పష్టత రావాల్సి ఉంది. బీఆర్ఎస్ నుంచి అంబటిరాయుడు ఆఫర్ వెళ్లినట్లుగా చెబుతున్నారు. బీఆర్ఎస్ ఏపీ ప్రెసిడెంట్? తోట చంద్రశేఖర్.. బీఆర్ఎస్‌లో చేరి గుంటూరు పశ్చిమ నుంచి పోటీ చేయాలని ఆహ్వానించినట్లుగా చెబుతున్నారు. అయితే అంబటి ఇంకా ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదు. ఇప్పుడు సీఎం జగన్ ను కలిసినందున వైసీపీలో చేరుతారని భావిస్తున్నారు. వచ్చే ఐపీఎల్‌లో ఆడుతారో లేదో అన్నదానిపై స్పష్టత లేదు. ఇప్పటికే అంబటి రాయుడు వయుసు 37 ఏళు .. ఆయన ఇంకా ఎక్కువ కాలం క్రికెట్ కెరీర్ సాగించడం సాధ్యం కాదు. ఈ ఏడాది ఆయన ఐపీఎల్ ఇన్నింగ్స్ గొప్పగా సాగడం లేదు. వచ్చే సారి టీంలో ఉంచుతారో లేదో కూడాతెలియదు. అందుకే క్రికెట్ అకాడెమీ పెట్టాలనే ఆలోచనలో కూడా ఉన్నారని చెబుతున్నారు. దానికి భూమి అడిగేందుకు జగన్ ను కలిశారన్న అభిప్రాయం కూడా వినిపిస్తోంది. అయితే సీఎం జగన్ తో భేటీపై .. అటు అంబటి రాయుడు కానీ ఇటు సీఎంవో కానీ ఇంకా అధికారిక ప్రకటన చేయలేదు.

# రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

చిత్తూరు చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలం, పాలకూర సమీపాన 140 జాతీయ రహదారిపై లారీని ఢీకొన్న కారు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. బెంగళూరు చెందినభక్తులు తిరుమల దర్శనానంతరం స్వస్థలానికి వెళుతున్నప్పుడు పూతలపట్టు సమీపాన పాలకూర వద్ద ప్రమాదం జరిగింది. ముందు వెళ్తున్న లారీని వెనుకవైపు కారు ఢీకొనడంతో లారీ సుమారు 200 మీటర్ల వరకు కారును లాక్కెళ్లింది. తరువాత ఏదో ప్రమాదం జరిగిందని గుర్తించిన లారీ డ్రైవర్ వాహనాన్ని ఆపాడు. కారులో ఒకరు మృతి చెందగా ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. 108 వాహనం ద్వారా గాయపడిన వారిని పూతలపట్టు పోలీసులు చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# ఏనుగుల దాడిలో ఇద్దరు మృతి

కుప్పం చిత్తూరు జిల్లా కుప్పం మండలం, మల్లానూరు పంచాయతి లో ఏనుగులు దాడి ఒక మహిళ మృతి చెందింది. పర్తిచేను గ్రామానికి చెందిన దేవేంద్ర భార్య ఉషా(36)రోజు ట్రైన్ లో మల్లానూరు నుండి బెంగళూరుకు పనికెళ్లేది. యధావిధిగా ట్రైన్ ఎక్కడానికి, తమగ్రామంనుండి తనతో పాటు మరో ఇద్దరు మహిళలతో కలిసి వెళ్లింది, రైల్వే స్టేషన్ కు వెళ్లే దారిలో ఏనుగులు దాడి చేయడంతోఇద్ధరు మహిళలు గాయాల తో తప్పించుకున్నారు. ఉషా ఏనుగులుదాడిలో అక్కడికక్కడే మరణించినది. మృతురాలికి ముగ్గురు పిల్లలు, భర్త చనిపోయాడు. రెవెన్యూ మరియు అటవీ శాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపడుతున్నారు. మల్లానూరు పంచాయతి సప్పానికుంట గ్రామానికి చెందిన శివలింగం కుడా ఏనుగుల దాడి మృతి చెందాడు.

# మూడు పార్టీలకు ప్రతిష్టాత్మకం

రాజమండ్రి, మే 12, 2024 ఎన్నికలు మూడు పార్టీలకూ ఆఖరి పోరాటం అనే చెప్పాలి. ఎన్నికల్లో విజయం సాధించి అధికారం చేపట్టిన వారే ధన్యులు.. లేని పక్షంలో ప్రతిపక్ష పాత్ర కాదు కదా.. కనీసం రాష్ట్రంలో మనుగడ సాగించడం కూడా కష్టమే అని చెప్పాలి. కేవలం పార్టీలకే కాదు.. పత్రికలు, చానళ్లకు కూడా ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. దీంతో అన్ని పార్టీలు, పత్రికలు, చానళ్లు కూడా 2024 ఎన్నికలను చావో రేవోగా తీసుకొంటు న్నాయి. ప్రతి సీటూ గెలిచి తీరాల్సిందే. ప్రతీ ఓటు పడి తీరాల్సిందే. దీని కోసం ఎంతైనా చేస్తున్నారు. ఏం చేయడానికైనా సిద్ధంగా ఉన్నారు. సర్వేల మీద సర్వేలు చేయిస్తున్నారు. నియోజకవర్గాల్లో అభ్యర్థులు, ఇతర నాయకులు ఎంత ప్రయత్నాలు చేస్తున్నా, అధినాయకుల ప్రసన్నత కోసం ఎంతగా తహతహలాడుతున్నా అధిష్ఠానం అంతగా పట్టించుకోవడం లేదు. కేవలం గెలుపు గుర్రాలకు మాత్రమే సీటు ఇచ్చే ఆలోచనలో ఉన్నారు. ఆయన చంద్రబాబుకు దగ్గరి బంధువైనా, ముఖ్యమంత్రి జగన్‌కు బాగా కావాల్సిన వాడైనా, పవన్‌కు ఆప్తమిత్రుడైనా సరే అతనికి అర్హత కేవలం గెలవడమే.. అది ఉంటేనే అతనికి సీటు ఇస్తారు. లేకపోతే పక్కన పెడతారు. దీని కోసం అనేక సర్వేలు చేయిస్తున్నారు. విచారణలు చేయిస్తున్నారు. ఆరాలు తీస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీ అధికారంలోకి రాకపోయినా ఆ పార్టీ మనుగడ పూర్తిగా కష్టతరం అవుతుంది. 2029 నాటికి కనుమరుగు అవుతుంది.

ఇదే తాజా రాజకీయాల్లో కొనసాగుతున్న స్ట్రాటజీ.. దీంతో 24 ఎన్నికల ఫీవర్ అందరికీ పట్టుకుంది. ప్రతీ క్షణం విలువైనదిగా వారు భావిస్తున్నారు. ప్రతి అవకాశాన్ని వినియోగించుకుంటున్నారు. 2024లో ఎలాగైనా ముఖ్యమంత్రి పదవి దక్కించుకోవడం కోసం చంద్రబాబు నానా అవస్థలు పడుతున్నారు. వయస్సు మీద పడుతున్నా అవేమీ పట్టించుకోకుండా అహర్నిశలూ కష్టపడుతు న్నారు. ఈ సారి ఎలాగైనా చంద్రబాబు అధికారంలోకి వచ్చి తీరాలి. లేని పక్షంలో ఆయనకు సినిమా కష్టాలన్నీ వైసీపీ నాయకులు చూపిస్తారు. ఆ విషయం చంద్రబాబుకు కూడా తెలుసు. అందుకే తండ్రీ కొడుకులు నానా అవస్థలు పడుతున్నారు. గెలుపు గుర్రాలకే సీటు ఇచ్చే ఆలోచనలో ఉన్నారు. వారు ఎంతటి దగ్గర వారైనా, రక్త సంబంధీకులైనా, పార్టీలో ఎంత సీనియర్ అయినా సరే నోచాన్స్.. కేవలం గెలిచే అర్హత మాత్రమే ఉండాలి. అటువంటి వారు ఎంత చిన్న వయస్సు వారైనా కనీస అర్హత లేకపోయినా సరే వారికే సీటు ఇవ్వనున్నారు. అంతేగాక టీడీపీ ఈ ఎన్నికల్లో డబ్బుకు కూడా ప్రాధాన్యత ఇవ్వనుంది. బాగా సొమ్ములు ఖర్చు పెట్టే వారికే ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఓ పక్కన సర్వేలో మంచి రిపోర్టు రావాలి. దీనికి తోడు డబ్బు కూడా ఉండాలి. అటువంటి అభ్యర్థులకు మాత్రమే సీట్లు ఇస్తారు. చివరికి మంగళగిరిలో సర్వేలో లోకేష్ గెలుపు కష్టం అని సర్వే రిపోర్టు వచ్చినా సరే ఆయనకు బదులు వేరే వ్యక్తికి సీటు ఇస్తారు. ఇదీ తాజాగా టీడీపీలో అంతరంగిక పరిస్థితి. ఇక వైసీపీ విషయానికి వస్తే 24లో వైనాట్ 175 అంటూ ప్రచారానికి శ్రీకారం చుట్టారు. కానీ క్షేత్ర స్థాయిలో అంత సీన్ లేదు. కేవలం నవరత్నాల మీదనే జగన్ ఆధారపడ్డారు. అభివృద్ధి జాడ కనపడటం లేదు. అయితే 24లో మరోసారి అధికారంలోకి రావడానికి జగన్ అన్ని చర్యలు తీసుకొంటున్నారు. అధికారంలో ఉన్న పార్టీ అవ్వడం వల్లఆయనకు అన్నీ సాధ్యంగానే ఉన్నాయి. నవరత్నాలతో బాటు ఇతర పథకాలు, పనులు కూడా చేయిస్తున్నారు. దీనికి తోడు 24 ఎన్నికల్లో డబ్బులు అధికంగా ఖర్చు చేసేపార్టీ వైసీపీ అని చెప్పాలి. 24లో ఒక్కసారి అధికారంలోకి వస్తే చాలు.. భవిష్యత్తులో ప్రతిపక్షాల బెడద పూర్తిగా తొలగిపోతుంది. ముఖ్యంగా చంద్రబాబు సీన్ కూడా అయిపోతుంది. కోసం వెతుకులాట ప్రారంభించారు. జనసేన 2014లో టీడీపీకి సపోర్టు చేసింది. 2019లో సొంతంగా పోటీ చేసి చతికిల పడింది. 24లో టీడీపీతో పొత్తు అంటోంది. అయితే టీడీపీతో పొత్తు ఎటు దారి తీస్తుందో వారికే అర్థం కావడం లేదు. అధికారంలోకి వస్తే ముఖ్యమంత్రి పదవి ఎవరి చేపడతారు అనేది క్లారిటీ లేదు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉంటే పవన్ పరిస్థితి ఏంటీ అనే ఆలోచన వేధిస్తోంది. పవన్ ముఖ్యమంత్రి కాకుండా ఐదు సంవత్సరాలు ఏం చేస్తారు. అప్పుడు కేడర్ పరిస్థితి ఏంటీ ఇలా ఎన్నో ప్రశ్నలు జనసైనికులను చుట్టుముడుతున్నాయి.

## ఈనెల 14 నుంచి కపిలేశ్వర ఆలయంలోని నరసింహుడి దర్శనం

తిరుపతి ఈ నెల14వ తేది నుండి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దర్శన భాగ్యన్ని భక్తులకు కల్పిస్తున్నట్లు టిటిడి పాలక మండలి సభ్యులు పోకల అశోక్ కుమార్ తెలిపారు. తిరుపతి స్థానిక కపిలేశ్వర ఆలయంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి పునఃప్రతిష్ట చేయడంతో పాటు జిర్నోధారణ,అష్ట బంధ మహ సంప్రోక్షణ కార్యక్రమంలో టిటిడి పాలక మండలి బోర్డ్ సభ్యులు పోకల అశోక్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా మూడు ఆఘమాలు కలిసిన మహ పుణ్యక్షేత్రం తిరుపతి శ్రీ కపిలేశ్వర ఆలయం అన్నారు. శైవ,పాంచరాత్ర,వైఖానస అఘమాలు కలిసిన ఈ ధివ్య క్షేత్రంలో శిధిలావస్థలో ఉన్న శ్రీ లక్ష్మి నరసింహ ఆలయాన్ని పునః నిర్మాణం చేసి ఈ నెల 11 వ తేది నుండి 14 వ తేది వరకు మహా సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించి భక్తులకు అందుబాటులోకి తీసుకు వస్తునట్టు తెలిపారు. ఇక్కడ ఉన్నటువంటి ఈ లక్ష్మి నరసింహ ఆలయం పూర్తిగా శిధిలావస్థలో ఉండటాన్ని గమనించి ఆ ఆలయాన్ని పునః నిర్మించాలని కొంత మంది భక్తులు తన దృష్టికి తీసుకురావడంతో సుమారు 70 లక్షలు శ్రీవాణి నిధులతో ఆలయాన్ని సుదరంగా తీర్చి దిద్దడం జరిగిందన్నారు. అందుకు సహకరించిన టిటిడి చైర్మన్ వై వి సుబ్బారెడ్డికి అదేవిధంగా టిటిడి ఈఓ ధర్మారెడ్డికి,ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డికి జేఇఓలు వీర బ్రహ్మం, సదాభార్గవికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టెంపుల్ ఏ ఈ ఓ పార్థ సారధి, సూపర్డెంట్ భూమాపతి తిరుమల తిరుపతి దేవస్థానం ప్రధాన అర్చకులు వేణుగోపాల్ దీక్షితులు రిత్వికులు పండితులు పాల్గొన్నారు

## శ్రీ శ్రీ శ్రీ తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ తల్లికి సతీ సమేతంగా సారె సమర్పించిన జిల్లా ఎస్పీ పి. పరమేశ్వర రెడ్డి

**పాదయాత్రగా తన నివాసం (క్యాంప్ ఆఫీస్) నుంచి గంగమ్మ దేవాలయానికి వచ్చిన జిల్లా ఎస్పీ**

తిరుపతి పోలీస్ శాఖ తరపున శ్రీ శ్రీ శ్రీ తాతయ్యగుంట గంగమ్మ తల్లి వారికి సారె ను జిల్లా ఎస్పీ పి. పరమేశ్వర రెడ్డి భక్తి శ్రద్ధలతో సమర్పించారు. శ్రీ శ్రీ శ్రీ తాతయ్యగుంట గంగమ్మ తల్లికి సారె సమర్పించిన అనంతరం మాట్లాడుతూ పోలీస్ అధికారులు, సిబ్బంది అందరూ తమ తమ కుటుంబ సమేతంగా తరలివచ్చి, సారె సమర్పణ కార్యక్రమాన్ని ఘనంగా, చాలా సంతోషంగా నిర్వహించడం జరిగింది, జిల్లా పోలీసు సిబ్బంది వారి కుటుంబ సభ్యులు, ప్రజలు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, శాంతిభద్రతల నిర్వహణ సవ్యంగా జరగాలని ఆ గంగమ్మ తల్లిని కోరుకోవడం జరిగిందన్నారు.

## జగనన్నకు చెప్పుకుంటున్న వారు ఎవరు ?

విజయవాడ, మే 12 జగనన్నకు చెప్పుకుందాం అనే వినూత్న కార్యక్రమాన్ని సీఎం జగన్ ప్రారంభించారు. తొలిరోజే ప్రజల నుండి విశేష ఆదరణ లభించింది. ప్రజలు పెద్ద ఎత్తున తమ సమస్యలను చెప్పుకునేందుకు ప్రయత్నించారు. ఒక దశలో ఫోన్ కాల్స్ కలవక ఫిర్యాదు దారులు ఇబ్బందులు పడ్డారు. అందిన ఫిర్యాదులను శాఖల వారీగా వేరుచేసేందుకు సీఎం క్యాంపు కార్యాలయంలో ప్రత్యేకంగా మోనటరింగ్ సెల్ ఏర్పాటు చేశారు. ఎంత వేగంగా స్పందిస్తే అంత ప్రజల మద్దతు పొందే అవకాశం ఉంది. అందుకే ప్రభుత్వం ఈ అంశాన్ని సీరియస్ గా తీసుకుంది. అక్కడి నుండి వచ్చిన కాల్స్ వచ్చినట్లే సంబంధిత శాఖలకు అధికారులు స్పాట్‌లో బదలాయిస్తున్నారు. సామాన్య ప్రజల నుండి అందుకున్న ఫిర్యాదును సీఎం దగ్గర నుండి సంబంధిత శాఖ ప్రధాన కార్యదర్శికి, అక్కడ నుండి కమిషనర్‌కు, అక్కడ నుండి జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్లకు, అక్కడ నుండి మండలానికి, అక్కడ నుండి గ్రామ, వార్డు సచివాలయాలకు అత్యంత వేగంగా పంపేశారు. అందుకు సంబంధించి మెస్సేజ్ రూపంలో ఫిర్యాదు దారుడికి సమాచారం అందించారు. పిర్యాదు దారుడు చేసిన పిర్యాదుకు సంబంధించి పూర్తి సమాచారాన్ని క్షణాల్లో తెప్పించుకునేలా ఏర్పాట్లు చేశారు. ఈ తంతంగం అంతా సీఎం జగన్ కూడా నేరుగా పర్యవేక్షించేలా ఏర్పాట్లు చేశారు. ప్రతి సమస్యకు ఒక టైం బౌండ్ నిర్ణయించి ఆ సమయంలోగా దానిని పరిష్కరించాల్సి ఉంది. జగనన్నకు చెప్పుకుందామని వస్తున్న ఫిర్యాదుల్లో అత్యధికంగా రెవెన్యూ, పోలీస్, పెన్షన్లు వంటివాటిపైనే అధికంగా వచ్చినట్లు తెలుస్తోంది. రెవెన్యూ, పోలీస్ శాఖలపై పెద్ద సంఖ్యలో ప్రజలు ఫిర్యాదులు చేశారని చెబుతున్నారు. ఈ నంబర్‌కు కాల్ చేసిన కొంత మంది తమ ప్రాంతంలో రాజకీయ నేతల తీరుపై కూడా ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఐవీఆర్ఎస్ కాల్ రికార్డింగ్ అవుతుంది కాబట్టి తమ సమస్య తమ ప్రియతమ నేతకు తెలుస్తుందని భావించే వారు కాల్స్ చేసినట్లు తెలుస్తోంది. ఆది నుండి పార్టీ జెండా మోసిన తాము పార్టీకి దూరంగా ఉంటున్నామని, తమపై సొంత పార్టీవారే కేసులు పెట్టారని కొంత మంది, పార్టీ కార్యక్రమాలకు ఆహ్వానించడం లేదని మరికొంత మంది ఇలా రకరకాలుగా ఫిర్యాదు చేసినట్లు చాలా జిల్లాల్లో పార్టీ నేతల మధ్య చర్చ జరిగింది. అయితే ఇది పార్టీ పరమైన కార్యక్రమం కాదని అలాంటి కాల్స్ ను పరిగణనలోకి తీసుకోవడం లేదంటున్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రారంభించిన తొలి రోజే విపక్షాలు విమర్శలు గుప్పించాయి. ఎక్కడ సమస్యలు లేవని ప్రత్యేకంగా చెప్పాలని టీడీపీ ప్రశ్నించింది. జగనన్నకు చెప్పుకోవడం అంటే చెవిటి వాడి ముందు శంఖం ఊదినట్లేనని బీజేపీ మండిపడింది. సమస్య ఏదైనా తమ బాధను స్వయంగా ముఖ్యమంత్రి కార్యాలయానికి చెప్పుకునే అవకాశాన్ని మాత్రం ప్రజలు సద్వినియోగం చేసుకుంటారని.. వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని ప్రభుత్వ వర్గాలంటున్నాయి. పనితీరుతోనే రాజకీయ విమర్శలకు చెక్ పెడతామంటున్నారు

## సెంటు స్థలాల కోసం అమరావతి భూముల కేటాయింపు

అమరావతి,మే 12 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రాజధాని అమరావతి ప్రాంతంలో పేదలకు ఇళ్ల స్థలాల కేటాయింపునకు సంబంధించి మరో జీవో జారీ చేసింది. ఎస్-3 జోన్ పేదల ఇళ్ల స్థలాలకు 268 ఎకరాలు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో లబ్దిదారుల సంఖ్య మేరకు అదనంగా భూమి కావాలంటూ కలెక్టర్లు లేఖ రాశారు. కలెక్టర్ల లేఖ మేరకు అదనపు భూమి కేటాయింపును సీఆర్డీఏ ప్రభుత్వానికి ప్రతిపాదన పంపింది. సీఆర్డీఏ కమిషనర్ ప్రతిపాదనల మేరకు ఏపీ సర్కార్.. అమరావతి రాజధానిలో ఎస్-3 జోన్‌లో పేదల ఇళ్ల స్థలాలకు 268 ఎకరాలను కేటాయిస్తూ ఉత్తర్వులు చేసింది. పేదలందరికీ ఇళ్ల పథకం కింద ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఎస్-3 జోన్‌లోని 268 ఎకరాలను.. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌కు 168 ఎకరాలు, గుంటూరు కలెక్టర్‌కు 100 ఎకరాలు కేటాయించారు. రాజధానిలోని బోరుపాలెంలో 2 ఎకరాలు, పిచుకల పాలెంలో 20 ఎకరాలు, అదే గ్రామంలో వేరే బ్లాకులో 81 ఎకరాలు, అనంతవరం లో 64 ఎకరాలు, నెక్కల్లులో వంద ఎకరాలను పేదలకు ప్రభుత్వం కేటాయించింది. సీఆర్డీఏ కమిషనర్ అనుమతితో రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నవరత్నాలు, పేదలందరికీ ఇళ్ల పథకం కింద ఇళ్ల స్థలాలను కేటాయించాలని నిర్ణయించింది. ఈ మేరకు యన్టీఆర్, గుంటూరు, జిల్లాల కలెక్టర్‌లకు ఏపీ సర్కార్ ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే ఆర్ ? 5 జోన్‌లో 1,134 ఎకరాలను పేదలకు ఇళ్ల స్థలాల కోసం ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించిన పట్టాల పంపిణీకి శరవేగంగా పనులు కొనసాగుతున్నాయి. బహుళ ప్రయోజనాల అవసరాల కోసం నిర్దేశించిన ఎస్-3 జోన్‌లో ఎకరం ధర రూ.4.1 కోట్లని ఈ ఏడాది ఏప్రిల్ 3వ తేదీన జరిగిన 33వ సీఆర్‌డీఏ సమావేశంలో నిర్ణయించారు. ఇప్పుడు అందులో 6 శాతం ధరకే అంటే.. ఎకరా రూ.24.40 లక్షల చొప్పున 268 ఎకరాలను ప్రభుత్వానికి విక్రయించాలని సీఆర్‌డీఏ నిర్ణయించింది. 'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు' కార్యక్రమంలో భాగంగా ఇళ్ల పట్టాల కోసం తీసుకుంటున్నందున మౌలిక ధరలో ఆరు శాతానికే విక్రయించదానికి నిర్ణయించినట్లు సీఆర్‌డీఏ పేర్కొంది. ఎన్టీఆర్ జిల్లా నుంచి 168 ఎకరాలకు ప్రతిపాదన రాగా..

బోరుపాలెంలో 2.05 ఎకరాలు, పిచ్చుకల పాలెంలో 20.47 ఎకరాలు, పిచ్చుకలపాలెంలోనే మరో 81.09 ఎకరాలు, అనంతవరం లో 64.39 ఎకరాలు కేటాయించారు. అలాగే గుంటూరు జిల్లా పరిధిలో నిర్దేశించిన వంద ఎకరాలను నెక్కల్లు గ్రామంలో కేటాయించింది. ఎన్టీఆర్ జిల్లాకు నిర్దేశించిన 168 ఎకరాలకు రూ.41.33 కోట్లు, గుంటూరు జిల్లాకు నిర్దేశించిన 100 ఎకరాలకు రూ. 24.60 కోట్లు.. మొత్తంగా 268 ఎకరాలకు రూ.65.93 కోట్లుగా సీఆర్‌డీఏ లెక్క గట్టింది. అయితే ఇలా అమరావతి భూములు ఇలా సెంటు స్థలాలుగా పంపిణీ చేయడం చట్ట విరుద్ధమని.. అమరావతి రైతులతో సీఆర్డీఏ చేసుకున్న ఒప్పందాలను ఉల్లంఘిస్తున్నరని రైతులు హైకోర్టుకు వెళ్లారు. అక్కడ అనుకూల తీర్పు రాకపోవడంతో సుప్రీకోర్టుకు వెళ్లారు. దీనిపైసుప్రీం కోర్టులో విచారణ జరగాల్సి ఉంది.

## తెలుగుదేశం మహానాడుకు భూమి పూజ

రాజమహేంద్రవరం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సమీపంలోని రూరల్ కడియం మండలం వేమగిరి 216వ నెంబరు జాతీయ రహదారి ప్రక్కనగల స్థలంలో ఈ నెల 27, 28 తేదీల్లో నిర్వహించే మహానాడుకు ఏపీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కింజారపు అచ్చెన్నాయుడు మహానాడు వేదిక వద్ద శుక్రవారం భూమిపూజ నిర్వహించి పనులు ప్రారంభిచారు. ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ మహానాడు నిర్వహణకు తెదేపా సీనియర్ నాయకులు సభ్యులుగా 200 మందితో కూడిన 16 కమిటీలను నియమించామన్నారు. మహానాడు జరిగే అన్ని రోజుల్లోనూ 15 లక్షల మంది ప్రజలు, పార్టీ నాయకులు వచ్చే విధంగా సభా వేదికను తీర్చిదిద్దుతున్నట్లు వారు వెల్లడించారు. భూమి పూజలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్, యనమల రామకృష్ణుడు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి భవాని, రెడ్డి సుబ్రమణ్యం, కేఎస్ జవహర్, జ్యోతుల నవీన్, గన్ని కృష్ణ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## ఇడియా అదుర్స్.. కానీ అవుతుందా?

కాకినాడ, మే 12 షరతులు పెట్టి ముఖ్యమంత్రి పదవిని సాధించలేమని జనసేన అధినేత పవన్ కల్యాణ? అన్నారు. బలాన్ని బట్టి సీట్లు అడుగుతామని చెప్పారు. జనసేనకు పట్టున్న ప్రాంతంలో ఖచ్చితంగా పోటీ చేస్తామని తెలిపారు. తన సత్తా ఏంటో చూపించి అప్పుడు ముఖ్యమంత్రి పదవి అడుగుతానని, అంతే తప్ప ముందుగా తనకు ముఖ్యమంత్రి పదవి కావాలని చెప్పి పొత్తులు కుదుర్చుకునే ప్రసక్తి లేదని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ఆయన జనసేన నేతలతో మాట్లాడారు. పొత్తులపై విముఖలతో ఉన్న పార్టీలను ఖచ్చితంగా ఒప్పిస్తామని తెలిపారు. తనను ముఖ్యమంత్రిని చేయాలని బీజేపీని కాని, టీడీపీని కాని అడగబోనని పవన్ కల్యాణ్ తెలిపారు. ముందస్తు ఎన్నికలు అంటున్నారు కాబట్టి జూన్ 3వ తేదీ నుంచి ఇక్కడే ఉంటానని, ప్రజాసమస్యలపై పోరాడతానని పవన్ తెలిపా?. ముఖ్యమంత్రి పదవి వరించి రావాలి కాని, మనం కోరుకుంటే అది వచ్చేది కాదని పవన్ కల్యాణ? అభిప్రాయపడ్డారు. మూడు పార్టీలు కలిసి... అంటే వైసీపీని ఓడించేందుకు పవన్ అన్ కండిషనల్‌గా పొత్తులు పెట్టుకోవాలని ఆయన భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే తనకు బలం ఉన్న స్థానాల్లో మాత్రం ఖచ్చితంగా పోటీ చేయాలని ఆయన నిర్ణయించుకున్నట్లు కనపడుతుంది. పొత్తులకు ముఖ్యమంత్రి పదవి అభ్యర్థి ప్రామాణికం కాదని పవన్ అన్నట్లు చెబుతున్నారు. బీజేపీతో కలుపుకుని టీడీపీతో కలసి వెళ్లాలన్న ప్రయత్నంలోనే పవన్ కల్యాణ్ ఉన్నారు. కనీసం ముప్పయి స్థానాల్లో గెలిచేలా ఆయన ప్లాన్ చేసుకుంటున్నారు అప్పుడు కర్ణాటక తరహాలో తననే పిలిచి మరీ ముఖ్యమంత్రి పదవి ఇస్తారన్న నమ్మకంతో పవన్ కల్యాణ్ ఉన్నట్లు కనపడుతుంది. అందరూ అనుకున్నట్లుగా, హరిరామజోగయ్య లాంటి వాళ్లు చెబుతున్నట్లుగా ముఖ్యమంత్రి పదవి తనకు ముఖ్యం కాదని, పొత్తులు కుదరడానికి ముఖ్యమంత్రి పదవి అడ్డం కాదని పవన్ స్పష్టం చేశారు. అంటే కింగ్ మేకర్‌గా కావాలన్నదే పవన్ ఉద్దేశ్యంగా కనిపిస్తుంది. ఆలోచన బాగుంది.. కానీ అది గ్రౌండ్ అవుతుందా? లేదా? అన్న అనుమానాలే జనసైనికులను వేధిస్తున్నాయి. సినిమా తరహా రాజకీయాలుఆంధ్రప్రదేశ్‌లో సినిమా తరహా రాజకీయాలు నడుస్తున్నాయి. ఇదే అధికారంలోనూ రిపీట్ అవుతుందన్న కామెంట్స్ సోషల్ మీడియాలో వినిపిస్తున్నాయి. వచ్చే ఎన్నికలలో ఏపీలో టీడీపీ, జనసేన కలసి పోటీ చేస్తాయని రెండు పార్టీలకు చెందిన క్యాడర్ కూడా విశ్వాసంతో ఉంది. రెండు అధికారంలోకి వస్తే తొలి రెండున్నరేళ్లు చంద్రబాబు, చివరి రెండున్నరేళ్లు పవన్ కల్యాణ్ ముఖ్యమంత్రి అవుతారన్న ప్రచారం కూడా నడుస్తుంది. అయితే ఇది రివర్స్ అయినా ఆశ్చర్యం లేదు. జనసేన తొలి రెండున్నరేళ్లు తమకు ముఖ్యమంత్రి పదవి కావాలని కోరే అవకాశముంది. ఇప్పుడు ఏపీలో టూర్లు కూడా అలాగే సాగుతున్నాయి. ముందుగా చంద్రబాబు వచ్చి పర్యటించి వెళతారు. ఆ తర్వాత జనసేన అధినేత పవన్ కల్యాణ్ వచ్చి పరామర్శిస్తారు. అదే తరహా పాలన చూడబోతున్నామంటూ సోషల్ మీడియాలో ఇటు టీడీపీ, అటు జనసేన అభిమానులు పోస్టింగ్‌లు పెట్టడం చర్చనీయాంశమైంది. ఏపీలో అకాల వర్షాలకు పంటలు దెబ్బతిని రైతులు అనేక మంది నష్టపోయారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో రైతులు దిగాలు పడుతున్నారు. ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని చెబుతున్నప్పటికీ ఇంత వరకూ తడిసిన ధాన్యం అంతా రైతుల వద్దనే ఉంది. ఈ నేపథ్యంలో ఇటీవల టీడీపీ అధినేత చంద్రబాబు నాలుగు రోజుల పాటు తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో పర్యటించారు. రైతులను పరామర్శించారు. తడిసిన పంటను పరిశీలించారు. ప్రభుత్వానికి 72 గంటల పాటు డెడ్‌లైన్ కూడా విధించారు. ధాన్యం కొనుగోలు చేయకపోతే జగన్ ఇంటి వద్దకు ఆ ధాన్యం తీసుకువచ్చేలా రైతులు సిద్ధంగా ఉండాలని చంద్రబాబు పిలుపు నిచ్చారు కూడా. 72 గంటల డెడ్‌లైన్ ముగిసింది. దీంతో చంద్రబాబు కలెక్టరేట్‌ల వద్ద నిరసనలు తెలియజేయాలని పార్టీ నేతలకు పిలుపు నిచ్చారు

## జైల్లోనే ఇమ్రాన్ హత్యకు కుట్ర.. గుండెపోటు వచ్చేలా ఇంజెక్షన్లు ఇచ్చారు : న్యాయవాదులు



అవినీతి కేసులో నాటకీయ పరిణామాల మధ్య పాకిస్థాన్ మాజీ ప్రధాని, పీటీఐ చీఫ్ ఇమ్రాన్ ఖాన్ మంగళవారం అరెస్టైన విషయం తెలిసిందే. ఇమ్రాన్ అరెస్ట్‌తో ఆ దేశంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మరోవైపు ఈ కేసులో ఇమ్రాన్‌కు సుప్రీం కోర్టు లో ఊరట లభించింది. ఆయన అరెస్టు అక్రమమని పాక్ అత్యున్నత న్యాయస్థానం తేల్చింది. ఈ నేపథ్యంలో ఇమ్రాన్‌ను ఆయన తరఫు న్యాయవాదులు కలిశారు. గంటకు పైగా ఆయనతో మాట్లాడారు. అనంతరం మీడియాతో వారు మాట్లాడుతూ.. సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇమ్రాన్‌ను జైల్లోనే హత్య చేసేందుకు కుట్రలు జరిగాయని ఆరోపించారు. తనను జైల్లో నిద్ర పోనివ్వట్లేదని ఇమ్రాన్ చెప్పినట్లు న్యాయవాదులు తెలిపారు. జైల్లో ఇమ్రాన్‌ను చిత్ర హింసలు గురి చేస్తున్నట్లు చెప్పారు. టాయిలెట్, బెడ్‌లేని ఒక గదిలో మాజీ ప్రధానిని ఉంచినట్లు పేర్కొన్నారు. వాష్‌రూమ్ వాడుకోవడానికి కూడా అనుమతించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జైల్లోనే ఇమ్రాన్‌ను హత్య చేసేందుకు కుట్ర చేసినట్లు ఆరోపించారు. ఆయనకు నెమ్మదిగా గుండెపోటు వచ్చేలా ఇంజెక్షన్లు, ఆహారం ఇచ్చినట్లు చెప్పారు. ఛాతీలో నొప్పిగా ఇక ఇస్లామాబాద్‌లోని పోలీస్ లైన్స్‌కు తీసుకొచ్చిన తర్వాత ఇమ్రాన్‌కు ఆహారం కూడా ఇవ్వడం లేదని న్యాయవాదులు వెల్లడించారు. అవినీతి నిరోధక సంస్థ నేషనల్ అకౌంటబిలిటీ బ్యూర్ (ఔంః) కస్టడీలో ఉన్న ఇమ్రాన్‌ను తక్షణమే విడుదల చేయాలని పాక్ సుప్రీంకోర్టు ఆదేశించింది.

## ఇంటర్మీడియట్ లో చేరే వారికి షెడ్యూల్ ఖరారు..

అమరావతి రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియట్ లో చేరే వారికి మొదటి విడత షెడ్యూల్ ను రాష్ట్ర ఉన్నత విద్యా మండలి విడుదల చేసింది. ఈనెల 15వ తేదీ నుంచి జూన్ 14వ తేదీ వరకు మొదటి విడత ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఈనెల 26 నుంచి జూన్ 24 వరకు మొదటి విడత ప్రవేశం ప్రక్రియ జరుగుతుంది. జూన్ 1 నుంచి తరగతులు ప్రారంభం అవుతాయి. ఈ ప్రవేశాలలో బాలికలకు 33.33శాతం సీట్లు కేటాయించినట్టు ఉన్నత విద్యా మండలి విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.

## అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో నర్సుల దినోత్సవం

కాకినాడ రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ బొండా సూర్యారావు మాట్లాడుతూ 1820 మే 12వ తేదీన ఇటలీ లో జన్మించిన ఫ్లోరెన్స్ నైటింగేల్ జన్మదినాన్ని నర్సుల దినోత్సవంగా జరుపుకుంటున్నామని అన్నారు. నైటింగేల్ ధనిక కుటుంబంలో పుట్టినా ప్రజలకు సేవ చేయాలనే బలమైన కాంక్షతో నర్సింగ్ వృత్తిని చేపట్టారని అన్నారు. డాక్టర్ అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ మొదటి ప్రపంచ యుద్ధంలో వేలాదిమంది క్షతగాత్రులైన సైనికులకు ఆమె విశేషమైన సేవలు అందించారని అన్నారు. ప్రపంచంలోనే మొదటి నర్సింగ్ కళాశాలను స్థాపించి వైద్యరంగంలో నర్సింగ్ వృత్తి ప్రాధాన్యతను నైటింగేల్ తెలిపారని డాక్టర్ అడ్డాల పేర్కొన్నారు. అనంతరం అడబాల రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దీప్తి , చింతపల్లి సుబ్బారావు, ఎస్. శ్రీ నగేష్, రేలంగి బాపిరాజు ,ఓం నమశ్శివాయ, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

## ఒక డెడ్ బాడీ.. వంద అనుమానాలు..

విజయవాడ, మే 12 ఒక డెడ్ బాడీ వంద అనుమాలు.. కాలిపోయిన స్థితిలో బీటెక్ విద్యార్థి అనుమానాస్పద మృతి.. బర్త్డే పార్టీ సెలెబ్రేషన్ లో పాల్గొన్న తెల్లారే అనంత లోకాలకు.. పెట్రోల్ బంక్ సీసీ టీవీలో ఒంటరిగా బైక్ పై బోటిల్ లో పెట్రోల్ తీసుకుని వెళ్తున్నట్లు రికార్డ్ అయినా దృశ్యాలు.. ఐ థింక్ థిస్ ఇజ్ మై లాస్ట్ డే అంటూ చివరి స్టేటస్.. స్టేటస్ పెట్టిన తెల్లవారే విజయవాడ నగరు శివార్లో కాలిన స్థితిలో దొరికిన జీవన్ డెడ్ బాడీ.. తండ్రి కట్టామని ఇచ్చిన ఈఎంఐ డబ్బులు వాడుకోవటమే ఆత్మహత్యకు కారణం అంటున్న పోలీసులు..? నిజంగానే ఆత్మహత్య లేక వేరే కోణం ఏదైనా ఉ ందా లెట్స్ వాచ్ థ స్టోరీ.. తోట్లవల్లూరు కు చెందిన జీవన్ ఫ్యామిలీ కొద్దికాలంగా విజయవాడలో వుంటున్నారు తండ్రి సుధాకర్ వాచ్ మెన్ కాగా?తల్లి హౌస్ వైఫ్ .. ఇక జీవన్ వన్ టౌన్ పొట్టి శ్రీరాములు కాలేజ్ లో బిటెక్ థర్డ్ ఇయర్ చదువుతున్నాడు. మంగళవారం రాత్రి ఇంటి నుండి పార్టీ ఉందంటూ వెళ్లినా జీవన్ తెల్లవారే కాలి శవమై కనిపించడు?ఆ రోజు అర్ధరాత్రి రెండు గంటల సమయంలో తల్లికి ఫోన్ చేసి ఇక నేను మీకు భారం కాను,నాన్న జాగ్రత్త ,నావల్ల మీరు ఇబ్బంది పడకండి అని చెప్పి ఫోన్ పెట్టేసాడు.. అనుమానం వచ్చిన తల్లి ఏమైందిరా ఏమన్నా అప్పులు ఉన్నాయా అని అడిగింది.. ఎం లేదంటూ ఫోన్ పెట్టేసిన జీవన్ ఇక ఫోన్ ఎత్తలేదు ?ఈలోపే తెల్లవారింది పోలీసుల నుండి జీవన్ చనిపోయాడంటూ వార్త రానే వచ్చింది దాంతో తల్లి తండ్రులు ఆస్పత్రి వద్ద గుండెలు పగిలేలా రోధించారు?స్నేహితులే ఎదో చేసారంటూ తండ్రి ఆరోపించాడు. ఈ కేస్ లో మొదటి నుండి పోలీసులు సైతం మర్డర్ గానే భావించారు అదే విధంగా మొదట మర్డర్ కేస్ గా నమోదు చేసారు.. కానీ అంతలోపు మరో కోణం వెలుగులోకి వచ్చింది?తండ్రి కట్టమని ఇచ్చిన 12 వేల ఈఎంఐ డబ్బులు కట్టకుండా తానా సొంతానికి వాడుకున్నట్లు దాని వాళ్ళ తండ్రి గట్టిగా మందలించాడని తల్లి పోలీసుల విచారణలో చెప్పింది.. తండ్రి మందలింపుతో మనస్తాపానికి గురైన జీవన్ ఇంట్లోంచి వెళ్ళిపోయి రెండు రోజుల తర్వాత ఇంటికి వచ్చి మళ్ళి పార్టీ ఉందంటూ బయటకు వెళ్ళాడు.. ఆలా వెళ్లినా జీవన్ మళ్ళి ఇంటికి రాలేదు.. ఇంట్లోంచి వెళ్లిపోయిన రెండు రోజులు జీవన్ స్నేహితులతోనే ఉన్నాడు.. బర్త్డే పార్టీ తర్వాత కూడా స్నేహితుల తోనే ఉన్న జీవన్ హ్యాపీ బర్త్డే శ్యామ్ అంటూ వీడియో చేసి ఇన్స్టాగ్రామ్ స్టేటస్ లో కూడా పెట్టాడు ?పార్టీ లో కూడా బాగానే ఉన్నాడు.. పార్టీ అయిపోయాక సడన్ గా ఏదో ఫోన్ వస్తే స్నేహితుడి బండి తీసుకుని బయటకు వెళ్ళినట్లుగా చెప్తున్నారు స్నేహితులు.. జీవన్ కు ఎలాంటి అప్పులు లేవని ఇంట్లో ఈఎంఐ డబ్బులు వాడుకోవటంతో వాళ్ళ నాన్న తిట్టాడని చెప్తున్నారు.. బండి అడిగి వెళ్ళినా కొద్దీ సేపటికే ఐ థిక్ థిస్ ఇజ్ మై లాస్ట్ డే అంటూ స్టేటస్ పెట్టడంతో అది చుసిన మరో స్నేహితుడు సరదాగా అనుకుని తొక్కలే అని రిప్లై పెట్టాడు దాంతో ఈ రాత్రికి నీకే తెలుస్తుందిలే అని మెస్సేజ్ పెట్టాడు జీవన్..మరో పక్క జీవన్ బైక్ పై ఒంటరిగా వెళ్తూ బోటిల్ లో 100 రూపాయల పెట్రోల్ కొట్టించుకున్నట్లు సీసీ కెమెరాలో రికార్డ్ అయింది.

# సిపిఐ పోరాట ఫలితమే జీవో నెంబర్ 1 రద్దు



నంద్యాల మా ప్రతినిధి మే 12 విభారె న్యూస్ :-రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అప్రజా సామికంగా ప్రజా వ్యతిరేకమైన జీవోలను తీసుకురావడం మానుకోవాలని జీవో నెంబర్ 1ని రద్దు చేయాలని సిపిఐ పోరాట ఫలితంగా హైకోర్టు రద్దు చేయడం హర్షనీయమని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ బాబా ఫక్రుద్దీన్ హర్షం వ్యక్తం చేశారు .. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆ ప్రజాస్వామిక పద్ధతుల్లో జీవో నెంబర్ ను 1ని విడుదల చేయడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాసే విధంగా సభలు సమావేశాలు ధర్నాలు రోడ్ షోలు నిర్వహించకుండా భారత రాజ్యాంగం కల్పించినటువంటి ప్రాథమిక హక్కులను ఉల్లంఘించేటటువంటి విధంగా బ్రిటిష్ కాలమునాటి చట్టాలు 1861 ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో తెచ్చినప్పటి జీవోను బ్రిటిష్ వారు కూడా అమలుపరచలేదని అటువంటి జీవోను రాష్ట్ర ప్రభుత్వం అమలుపరచాలని చేయడం దుర్మార్గమైన ప్రజా వ్యతిరేకమైన చర్య అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత దుస్సాహసమైన పద్ధతుల్లో దుర్మార్గమైనటువంటి పద్ధతుల్లో జీవో1ని తీసుకొచ్చి ప్రజల గొంతును నొక్కేటువంటి పద్ధతిలో ముందస్తు అరెస్టులు, గృహనిర్బంధాలు చేయడం దీనిని తీవ్రంగా ఖండిస్తూ ఈ అంశం పైన ఏపీ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి. కామ్రేడ్, కె .రామకృష్ణ హైకోర్టులో పిల్ వేసిన తర్వాత ,టిడిపి నేతలు విద్యార్థి, యువజన నాయకులుకూడ హైకోర్టులో పిటిషన్ వేసిన తర్వాత విచారణ అనంతరం హైకోర్టు జీవో నెంబర్ 1ని కొట్టివేయడాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ నంద్యాల జిల్లా సమితి సంపూర్ణంగా స్వాగతిస్తూ .హర్షం వ్యక్తం చేస్తున్నామని చెప్పారు . ఇ ప్పటికైనా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రజల యొక్క మనోభావాలను గౌరవించాలిఅలా కాకుండా పై కోర్టుకు వెళ్లడానికి ప్రయత్నం చేస్తే అక్కడ కూడా ఇలాంటి ఫలితాలే ఉంటాయి కావున రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం దీన్ని పరిగణనలోకి తీసుకొని హైకోర్టు తీర్పును గౌరవించి ప్రజల ప్రాథమిక హక్కులను కాపాడేటువంటి పద్ధతిలో హైకోర్టు తీసు కున్నటువంటి నిర్ణయాన్ని సంపూర్ణంగా గౌరవించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రజా వ్యతిరేకంగా ఏ జీవోలు తెచ్చిన సిపిఐ పార్టీ ముందుండి చీకటి జీవోలను రద్దు పరిచేంతవరకు పోరాటాలు నిర్వహించి ప్రజలకు అండగా ఉంటామని అన్నారు.

# విద్యా కానుక కిట్ల పంపిణీకి పకడ్బందీగా అమలు చేయాలి



## జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిల్లాని సమూన్

నంద్యాల మా ప్రతినిధి మే 12 విభారె న్యూస్ :-ఈ విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే లోపు పాఠశాల విద్యార్థులకు జగనన్న విద్య కానుక కిట్లను పంపిణీ చేసేందుకు పకడ్బందీ కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిల్లాని సమూన్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నంద్యాల పట్టణంలోని ఎస్పిజి హైస్కూలులోని మండల స్టాక్ పాయింట్ ను, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న రెమిడీయల్ తరగతులను, అప్పర్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఈ విద్యా సంవత్సరానికి సరఫరా చేసిన విద్యార్థుల యూనిఫామ్ దుస్తులను భౌతిక కొలతల ప్రకారం వచ్చాయా లేదా అని పరిశీలించారు. పాఠ్యపుస్తకాలను క్రమ పద్ధతిలో క్లాసులవారిగా విభజించి సరఫరా చేయాలన్నారు. జిల్లాలోని 29 మండల స్టాక్ పాయింట్ల నుండి జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేసేందుకు పకడ్బందీ కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జూన్ 1 నుండి 12 తేదీ వరకు మండల స్టాక్ పాయింట్ల నుండి అన్ని పాఠశాలలకు విద్యా కానుక కిట్లను సరఫరా చేయాలన్నారు. ఎంఈఓ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఏపిఎం, నాడు నేడు ఏఈలతో ఏర్పాటు చేసిన మండల టీం ప్రతిరోజు స్టాక్ పాయింట్ ను పరిశీలిస్తూ కిట్లలో ఏమైనా లోపాలు ఉంటే సంబంధిత సప్లయర్ ను సంప్రదించి రీప్లేస్ చేసుకొనేలా చర్యలు తీసుకోవాలని, అన్ని మండల స్టాక్ పాయింట్లు తనిఖీ చేయాలని డిఇఓ అనూరాధను కలెక్టర్ ఆదేశించారు.

## ఫస్ట్ ఎయిడ్ మరియు సిపిఆర్ పై శిక్షణ

### ప్రారంభించిన ఎమ్మెల్యే శిల్పా...




నంద్యాల మా ప్రతినిధి మే 12 విభారె న్యూస్ :-గత 27 సంవత్సరాల నుండి నంద్యాల నియోజకవర్గంలో శిల్పా సేవ సమితి ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలను శిల్పా కుటింబుకులు నిర్వహిస్తున్నారు . నిరంతర సేవా కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం నంద్యాల పట్టణంలోని సూరజ్ గ్రాండ్ హోటల్ లో శిల్ప సేవాసమితి ఆధ్వర్యంలో ఫస్ట్ ఎయిడ్ మరియు సిపిఆర్ పై సచివాల హెల్త్ సెక్రటరీలు, ఆశ వర్కర్లు, సచివాలయ సిబ్బందికి శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు . ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. శిక్షకులు పలు సూచనలు సలహాలు తెలిపారు. ఈ శిబిరంలో హైదరాబాద్ నుండి వచ్చిన వైద్యులు ప్రవీణ్ కుమార్ రాథోడ్, శివరంజని సంతోష్ ఫస్ట్ ఎయిడ్ మరియు సిపి ఆర్ పై శిక్షణ అందించారు.ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి మాట్లాడుతూ.. అత్యవసర ప్రమాదాలు, గుండెపోటు సంభవించినప్పుడు వెంటనే స్పందించి వారి ప్రాణాలను రక్షించేందుకు ఫస్ట్ ఎయిడ్ మరియు సిపిఆర్ శిక్షణ ఉపయోగ పడుతుందని తెలిపారు. అలాగే భాదితులు ఆసుపత్రి కి వెళ్లే లోపు ప్రాణాలకు భరోసాను కల్పించవచ్చున్నారు. శిల్పా సేవ సమితి ఆధ్వర్యంలో సామాజిక బాధ్యతలో భాగంగా ఈ శిక్షణ శిబిరాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. వైద్యులు ప్రవీణ్ కుమార్ రాథోడ్, శివరంజని సంతోష్ సేవలను ప్రశంసించారు. మీ ప్రాంత పరిసరాలలో ఎక్కడైతే ప్రమాదాలు అత్యవసర సేవలు , గుండెపోటు సంభవించిన వారిని కాపాడేందుకు సచివాలయం హెల్త్ సెక్రెటరీలు, ఆశా వర్కర్లు వెంటనే స్పందించాలని ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారి విలువైన ప్రాణాలను కాపాడాలని కోరారు. భవిషత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపడతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# పట్టణంలో వీధి కుక్కలు ఉన్నాయి పిక్కలు జాగ్రత్త




### సీపీఐ నాయకుల ఆరోపణ

నంద్యాల మా ప్రతినిధి మే 12 విభారె న్యూస్ :- నంద్యాల పట్టణంలో వీది కుక్కలు ఉన్నాయి పిక్కలను పీకుతున్నాయని . జాగ్రత్తగా ఉండాలని సీపీఐ నాయకులు సూచించారు . నంద్యాల పట్టణంలోని 42 వార్డులలో విలయతాండవం చేస్తున్న వీది కుక్కలను మున్సిపల్ అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు . శుక్రవారం సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ రవిచంద్ర రెడ్డి కి వినతిపత్రం ఇవ్వడానికి పోతే మున్సిపల్ కార్యాలయంలో ఏ అధికారి లేకపోవడం తో ఫిర్యాదు బాక్స్ లో వేశామని సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ సహాయ కార్యదర్శి జి సోమన్న ఏఐటీయూసీ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు భూమని శ్రీనివాసులు డి శ్రీనివాసులు సిపిఐ నాయకులు హుస్సేన్నా సుబ్బరాయుడు మా భాష రహిమాన్ తెలిపారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ నంద్యాల పట్టణంలోని 42 వార్డులలో వీధి కుక్కలు సైర విహారం చేస్తున్నవి ఈ మధ్యకాలంలోనే చాంద్బాడా హరిజనవాడ వైయస్సార్ నగర్ నడిగడ్డ ముల్లాంపేట వి సి కాలనీలో చిన్నారులను వీధి కుక్కలు విచక్షణారహితంగా కరవడం జరిగిందన్నారు. కనుక పట్టణ ప్రజలను చిన్నారులను వీధి కుక్కల బారిన పడకుండా మునిసిపల్ అధికారులు కాపాడాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పార్టీ నాయకులు కోరారు.

# 13.05.2023 శనివారం అష్టమి పురస్కరించుకొని కాలభైరవ హోమం.

కర్నూలు మే 12 విభారే న్యూస్. కాల భైరవ హోమం 13-05-2023, కృష్ణ పక్ష అష్టమి, శని వారం సాయంకాలం 5:30 గం..లకు ప్రారంభం..మన జీవనంలో ఎన్నో సమస్యలు ప్రతిరోజు ఏదో సమస్యతో ఇబ్బంది పడుతూ ఉంటాము. అన్నింటికీ పరిష్కారం కాలభైరవ స్వామి అనుగ్రహం చేత లభిస్తుంది. నరదృష్టి ,శత్రు సమస్యలు, భూ సమస్యలు, కోర్టు వివాదాలు సొంతగృహం వివాహం సంతానం, అనారోగ్యం, ఉద్యోగం ఇతరత్రా అన్ని సమస్యల పరిష్కారమునకు ఈకాల భైరవ హోమం జరుగుతుంది.ప్రధాన హోమం -3,500 సంకల్పం -116కాల భైరవ హోమ వివరములకు సంప్రదించగలరు..8668087703దేవాలయం ఫోన్ పే గూగుల్ పే నెంబర్:8896123777.



# విద్యాశాఖను నాన్ వెకేషన్ డిపార్ట్మెంట్ గా పరిగణించండి.

### - డీఈఓ రంగారెడ్డికి వినతిపత్రం అందజేసిన ఫ్యాప్టో సభ్యులు.

కర్నూలు మే 12 విభారే న్యూస్.జిల్లా ఫ్యాప్టో చైర్మన్ ఎస్.గోకారివెకేషన్ డిపార్ట్మెంట్ అయినా విద్యాశాఖలో ఉపాధ్యాయులచే వేసవి సెలవులలో పనిచేయించుకొనుటను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఫ్యాప్టో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హెచ్.హృదయరాజు కర్నూలు జిల్లా ఫ్యాప్టో చైర్మన్ ఎస్. గోకారి,సెక్రటరీ జనరల్ జి.తిమ్మప్ప లు కర్నూలు జిల్లా విద్యా శాఖ అధికారి కార్యాలయంలో డీఈవో ని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి సెలవులలో ఉపాధ్యాయులకు ఎస్ సి ఈ ఆర్ టి నిర్దేశించిన బాధ్యతలకు సంబంధించిన గాని, వి లవ్ రీడింగ్ కార్యక్రమాలకు సంబంధించి గాని, పదవ తరగతి పరీక్షలలో ఫెయిల్ అయిన విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహించుటకు సంబంధించిన గాని విద్యాశాఖ కమిషనర్ నుండి డి.ఇ.ఓ ల నుండి ప్రధానోపాధ్యాయుల ద్వారా ఉపాధ్యాయులకు ఎటువంటి రాతపూర్వక ఉత్తర్వులు ఇవ్వకుండానే మౌఖిక ఆదేశాల తోనే ఈ కార్యక్రమాలకు సంబంధించి మొత్తం వేసవి సెలవులలో పని చేయించుకుంటున్నారని ఈ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. అవసరమైతే మిగిలిన డిపార్ట్మెంట్ల మాదిరిగానే విద్యాశాఖను కూడా నాన్ వెకేషన్ డిపార్ట్మెంట్ గా పరిగణించి ఉపాధ్యాయులచే అన్ని రకాల కార్యక్రమాలను నిర్వహించుకుని సంపాదిత సెలవులను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అంతేగాని వేసవి సెలవులలో అన్ని రకాల కార్యక్రమాలకు ఉపాధ్యాయుల చేత వెట్టి చాకిరి చేయించుకోవడం తగదని విమర్శించారు.ఈ కార్యక్రమంలో యు టి ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జయరాజు, ఎస్ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి టి.కే. జనార్ధన్, ఏ పి టి ఎఫ్ 1938 జిల్లా అధ్యక్షుడు మారియానంధం, ఎస్ సి, ఎస్ టి నుండి సతీష్ కుమార్ ఏపీటీఎఫ్ 257 నుండి యోగి ఈశ్వర్ , బి టి ఏ నుండి సుధాకర్ ఎస్ టి యు నుండి నాగరాజు,శ్రీధర్,గోవింద్ తదితరులు పాల్గొన్నారు.



# నేడు అష్టమి సందర్భంగా శ్రీ సూర్య దేవాలయంలో దత్తాత్రేయ స్వామికి విశేష పూజలు.

కర్నూలు మే 12 విభారే న్యూస్.13-05-2023వ తేదీన శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయం నందు శనివారం అష్టమి సందర్భంగా శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయం నందు శ్రీ దత్తాత్రేయ స్వామి వారికి అనగాష్టమి వ్రతం నిర్వహించబడును ఈ వ్రతం చేసుకోవడం వల్ల గురు బలం పెరుగుతుంది.ఉద్యోగము , వివాహము లో ఆటంకాలు తొలుగుతాయి,విద్య బుద్ధులు కలుగుతాయి, వైవాహిక జీవితంలో సమస్యలు తొలగిపోవడానికి,సకల సంకటాల నుండి విముక్తి పొంది స్వామి వారి అనుగ్రహం కలుగుతుంది. భక్తాదులు ఈ పూజా కార్యక్రమంలో పాల్గొని శ్రీ దత్తాత్రేయ స్వామి వారి సంపూర్ణ అనుగ్రహమును పొందగలరని ఆశిస్తున్నాము.అనఘాష్టమి వ్రతం ప్రధానముగా -1116/-సామూహికంగా -300/-సంకల్పం -116/-దత్త హోమంప్రధానంగా:3500/- హోమ సంకల్పం:116/- వివరములకు సంప్రదించగలరు.9440533770. దేవాలయం ఫోన్ పే గూగుల్ పే నెంబరు:8896123777.



# సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే

### శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి ఎమ్మెల్యే

నంద్యాల మా ప్రతినిధి మే 12 విభారె న్యూస్ :-నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు నడిగడ్డలో 102 వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కౌన్సిలర్ ఆరిఫ్ నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 6.30 గంటల నుండి ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి గడపగడప తిరుగుతూ రాష్ట్ర ప్రభుత్వం అందించిన సంక్షేమ కరపత్రాలను లబ్ధిదారులకు అందించారు...వైయస్సార్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలను వాలంటరీ ద్వారా ఇంటి వద్దకు పంపించడం ఎంతో సంతోషంగా ఉందని వార్డు ప్రజలు అన్నారు. అలాగే వార్డులో ఉన్న చిన్న చిన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వాటిని అక్కడే ఉన్న మున్సిపల్ అధికారులకు తెలిపి వాటిని సత్వరమే పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు..ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ మాభూన్నిసా, వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్ పాము షావలి. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాస్. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# కార్యసిద్ధి ఆంజనేయ స్వామి జయంతి సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు.

కర్నూలు మే 12 విభారే న్యూస్.శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయం నందు ఉపఆలయం కార్యసిద్ధి ఆంజనేయస్వామి జయంతి సందర్భంగా విశేషముగా 14/5/2023 ఆదివారం ఉదయం 6:30 నిమిషాలకు పంచామృత అభిషేకాలు,8:30 ఆకు పూజలు,9:30 వడమాల సేవలు,11:00 హనుమత్ హోమం జరుగును. హనుమత్ హోమం ద్వారా శత్రు నివారణ,కార్యసిద్ధి, సర్వత్రా విజయం కలుగును.అభిషేకం ప్రధానంగా 516-/అభిషేకం సామూహికంగా 200-/ఆకు పూజ 200-/ వడమాల సేవ 500-/హనుమత్ హోమం 3500-/హోమ సంకల్పం 150-/ ×సంప్రదించవలసిన నెం అశోక్ కుమార్ ఆచార్యులు 9032577369 దేవాలయం ఫోన్ పే, గూగుల్ పే నెంబరు:8896123777.



# హనుమద్ జయంతి ఆహ్వానం





-ఈ నెల 14 వ తేది వైశాఖ బహుళ దశిమి హనుమద్ జయంతి ని పురస్కరించుకొని కర్నూలు సంకల్ బాగ్ హరిహర క్షేత్రం లో శాస్త్రోక్తం గా ఉత్సవం నిర్వహిస్తున్నట్లు కర్నూలు నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు కల్లె చంద్రశేఖర్ శర్మ, కార్యదర్శి హెచ్ కె రాజశేఖర్ రావు లు తెలిపారు. ఉదయం గోపూజా, అనంతరం అభయాంజనేయ స్వామి మూల మూర్తి కీ మరియు ఉత్సవ మూర్తి కీ తేనే తో మరియు పంచామృత అభిషేకం, సహస్ర నామ అర్చన, సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం, మరియు మన్యుసూక్త హోమం నిర్వహించబడును. అలాగే సాయంత్రం 6 గంటలకు ఆంజనేయ స్వామి రథం పై జొకీ పేట, ప్రకాష్ నగర్ పుర వీధుల్లో భక్తులకు దర్శనం ఇస్తారని ఈ అవకాశం వినియోగించు కొని భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదం స్వీకరించి ఆంజనేయ స్వామి వారి కృప కు పాత్రులు కావలెను అని నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు కల్లే చంద్రశేఖర్ శర్మ మరియు ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య కోశాధికారి హెచ్ కె మనోహర రావు కోరినారు.ఈ కార్యక్రమం లో నగర బ్రాహ్మణ సంఘం కమిటీ సభ్యులు మాధవ ప్రభు, ఉమేష్, కేజీ ప్రభాకర్, శివరాం ప్రసాద్, రమా మనోహర్, బృందావన్ శ్రీధర్, విజయభాస్కర్, పార్థసారథి, సోమనాథ్ మూర్తి, కల్కూర మురళిమరియు ఆలయ అర్చకులు ప్రసన్న ,శివ స్వామి, గురు రాజారావు, రాఘవేంద్రరావు, సభ్యులు పాల్గొన్నారు

## దిశ యాప్ డౌన్ లోడ్ చేసుకోండి జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి

నంద్యాల మా ప్రతినిధి మే 12 విభారె న్యూస్ :-ఏపీ డీజీపీ శ్రీ కె. రాజేంద్రనాథ్ రెడ్డి గారి ఆదేశాలమేరకు నంద్యాల జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి గారి పర్యవేక్షణలో నంద్యాల జిల్లాలో దిశ యాప్ డౌన్లోడ్ మరియు రిజిస్ట్రేషన్ కార్యక్రమం విస్తృతంగా చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లాలోని అధికారులు పోలీస్ సిబ్బంది మరియు గ్రామ /వార్డు మహిళా కార్యదర్శిలతో దిశ యాప్ పట్ల ప్రజలకు అవగాహన కల్పించి, డౌన్లోడ్ చేయించి రిజిస్ట్రేషన్ చేయించే కార్యక్రమం విస్తృతంగా చేపట్టడం జరిగింది.దిశా అప్లికేషను వారి ఫోన్ లలో నిక్షిప్తం చెసి దానిని ఉపయోగించే విదానాన్ని వివరిచడం జరిగింది.నంద్యాల జిల్లాలోని అన్ని గ్రామాలలో జిల్లా ఎస్పీ శ్రీ కె.రఘువీర్ రెడ్డి గారి ఆదేశాలమేరకు జిల్లాలోని పోలీస్ అధికారుల పర్యవేక్షణలో పోలీస్ సిబ్బంది మరియు గ్రామ /వార్డు మహిళా కార్యదర్శిలతో ప్రతి గ్రామంలో ట్రాఫిక్ నిబంధనల గురించి మరియు బాల్య వివాహాల గురించి గురించి,దిశా యాప్ రిజిస్ట్రేషన్ మరియు డౌన్లోడ్స్ వాటి గురించి ప్రజలకు విస్తృత అవగాహన కల్పించడం జరిగింది.?జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు విజిబుల్ పోలీసింగ్ నిర్వహించి ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంగించిన వారిపై యం. వి. చలనాలు విధించి వారిపై కేసులు నమోదు చేశారు.

## ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల రెమిడియల్ తరగతులను--- అర్బన్ హెల్త్ . సెంటర్ ను తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్

నంద్యాల మా ప్రతినిధి మే 12 విభారె న్యూస్ :- నంద్యాల జిల్లా కేంద్రంలో శుక్రవారం నాడు జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సామూన్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న రెమిడీయల్ తరగతులను తనిఖీలు నిర్వహించారు , తదుపరి ఆత్మకూరు బస్టాండ్ రోడ్లోని అప్పర్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ను కలెక్టర్ తనిఖీ చేశారు. ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్స్ ఎలా చేస్తారని మెడికల్ ఆఫీసర్ ను ప్రశ్నించారు. ఐడి క్రియేషన్, కాల్స్ డేటా, క్యాలెండర్ మెయింటైన్ సంబంధిత రిజిస్టర్లు నిర్వహిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకుంటూ రికార్డులను పరిశీలించారు. ఈసీజీ మిషన్, ట్యాబ్స్ పనిచేస్తున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది కొరత వల్ల టెస్టు చేయడంలో ఇబ్బంది అవుతుందని మెడికల్ అధికారి కలెక్టర్ కు నివేదించగా చర్యలు తీసుకోవాలని డిఎంహెచ్వో డాక్టర్ వెంకటరమణను కలెక్టర్ ఆదేశించారు.





EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190